

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

శుక్రవారం, 20 జూన్ 2025

వానాకాలం వచ్చిందంటే చాలు.. భద్రాచలం వాసులను గోదావరి వరదలు భయపెడుతుంటాయి. పట్టణంలోని పలు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తుతుండటంతో.. జనజీవనం స్తంభిస్తూ ఉంటుంది. ఈ క్రమంలో అత్యవసర సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం శ్రమిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో గత అనుభవాలు, పరిణామాలను దృష్టి పెట్టుకుని ప్రజలకు ఎంతో అవసరమైన వైద్యసేవలను సత్వరమే అందించేలా కసరత్తు చేస్తున్న వైద్య శాఖ.. ప్రధానంగా గర్భిణుల సంరక్షణపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా గోదావరి వరద ముంపు ప్రాంతాల పరిధిలో ఉండే గర్భిణులను గుర్తించి వారిని ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అవసరమైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.



గోదావరి వరదల్లో గర్భిణులను రెస్క్యూ బోట్‌లో తీసుకొస్తున్న దృశ్యం (ఫైల్)

రిస్క్ లేకుండా.. రాకుండా..

- గోదావరి ముంపు ప్రాంతాల్లోని గర్భిణుల గుర్తింపు
- వరదల సీజన్ నేపథ్యంలో వైద్యశాఖ ముందస్తు కసరత్తు
- మూడు నెలల్లో 230మంది ప్రసవించే అవకాశమున్నట్టు అంచనా
- హైరిస్క్ గర్భిణులు 84 మంది ఉన్నట్టు నిర్ధారణ
- ఏ పరిస్థితుల్లోనైనా వైద్యం అందించేలా ఏర్పాట్లు
- భద్రాద్రి ఏరియా వైద్యశాలలో ప్రత్యేక పడకలు సిద్ధం

భద్రాచలం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా గర్భిణులకు ప్రసవం సమయమనేది ఎంతో కీలకం. ముఖ్యంగా వర్షాకాలంలో.. అదీ గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో వచ్చే వరదల సమయంలో అయితే వారి అవస్థలు వర్ణనాతీతం. వరదలు వచ్చిన క్రమంలోనే ప్రసవ సమయం సమీపించిందంటే వారికి సేవలందించడం ఎంతో కష్టం. ఎందుకంటే ఎగువన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 43 అడుగులకు చేరిందంటే తొలి ప్రమాద హెచ్చరికగా ప్రకటిస్తారు. 48 అడుగులు వచ్చిందంటే రెండో ప్రమాద హెచ్చరికగా, 53 అడుగులు వస్తే తుది ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. అలా వరదలొచ్చిన పలు సందర్భాల్లో ప్రసవసమయం సమీపించిన గర్భిణులు అవస్థలపాలైన సందర్భాలున్నాయి. ముఖ్యంగా భద్రాచలం వద్ద గోదావరి 60 అడుగులు దాటి ప్రవహిస్తోందంటే దాదాపుగా ప్రధాన రహదారులపై రాకపోకలు స్తంభిస్తాయి. దీంతో గర్భిణులను వైద్యశాలలకు తరలించడం కష్టసాధ్యంగా మారుతుంది. ఈ క్రమంలో కొన్నేళ్లుగా అప్రమత్తమవుతున్న జిల్లా అధికార యంత్రాంగం, వైద్యఆరోగ్యశాఖ అధికారులు వరదొలొస్తే.. రిస్క్ లేకుండా.. రిస్క్ రాకుండా ఉండేలా కసరత్తు చేస్తున్నారు. ప్రసవ తేదీ సమీపించిన గర్భిణులను ముందస్తుగానే గుర్తించి వారిని తొలి ప్రమాద హెచ్చరికకు చేరుకోగానే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రసవం క్లిష్టమవుతుందని ముందస్తుగా గుర్తించిన వారిని రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరే లోపే మెరుగైన వైద్యం కోసం భద్రాచలం, మణుగూరు ఏరియా వైద్యశాలలకు తరలించి అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డుల్లో ఉంచి వైద్యం అందిస్తున్నారు. ఈ ఏడాది రాబోయే వానాకాలం, వరదలొస్తే తీసుకోవాల్సిన ముందు జాగ్రత చర్యలపై యంత్రాంగం దృష్టి పెట్టింది. గర్భిణుల గుర్తింపును కూడా పూర్తి చేసింది.

ముంపు ప్రాంతాల్లో గుర్తించిన గర్భిణుల వివరాలిలా...

నెల	ప్రసవాలు	హైరిస్క్
జూలై	66	21
ఆగస్టు	74	29
సెప్టెంబరు	90	34

ఈ పీహెచ్‌సీల పరిధిలో గండం..

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోనే ప్రసవ తేదీ సమిపించిన గర్భిణులకు గండం పొంచి ఉంటోంది. కరకగూడెం, పినపాక, (మిగతా 6వ పేజీలో)

ఆ మూడు నెలల్లో ప్రసవించే వారిని గుర్తించాం

డాక్టర్ జయలక్ష్మి, మాతా శిశు విభాగం భద్రాద్రి జిల్లా ప్రోగ్రాం అధికారి



జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎంత మంది గర్భిణులు ప్రసవించే అవకాశం ఉందో ఇప్పటికే గుర్తించాం. అలాంటి వారిని వరదల సమయంలో ముందస్తుగా తరలించి ప్రసవం నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం వైద్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వాస్తవానికి రుతుపవనాలు ముందుగా వచ్చాయనే కారణంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జూన్ నెలకు సంబంధించిన గర్భిణుల వివరాలు సేకరించమనడంతో వరదలకు కూడా ముందుగానే సిద్ధమయ్యాం.



తాటి, ఈత వనాల పెంపకంపై దృష్టి

- ఈ ఏడాది వన మహోత్సవంలో మొక్కలు నాటేలా ప్రణాళిక
- ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులకు ఆదేశాలు 6

ఏదులాపురం సొసైటీలో

ధాన్యం దందాపై అధికారుల ఆరా!

- కలెక్టర్‌ను కలిసేందుకు సిద్ధమైన బాధిత రైతులు
- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఖమ్మంరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఏదులాపురం సహకార సంఘంలో జరిగిన ధాన్యం దందాపై అధికారులు ఆరా తీశారు. 'తరుగుపేరిట రూ.కోటి కొట్టేశారు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ కథనానికి జిల్లా సహకార సంఘం ఉన్నతాధికారులు స్పందించారు. ఏదులాపురం సొసైటీ పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న ధాన్యం దందాకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించేపనిలో అధికారులు నిమగ్నమైనట్టు విశ్వసనీయ సమాచారం. ఈ ఏదులాపురం సొసైటీపై గతంలో కూడా ధాన్యం అక్రమాలు పెద్ద ఎత్తున వెలుగుచూశాయి. గత అక్రమాలపైనా 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలపై నాటి కలెక్టర్, జిల్లా అధికారులు విచారణ నిర్వహించి అప్పటి సొసైటీ సీఈవోను, (మిగతా 6వ పేజీలో)

అసెస్‌మెంట్లపై విజిలెన్స్ విచారణ

- అసైన్డ్ భూముల్లో ఆక్రమణలు, అవినీతిపై ఆరా
- హాజరైన రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు
- మున్సిపల్ కార్యాలయంలో పలు రికార్డుల పరిశీలన



విచారణ నిర్వహిస్తున్న అధికారులు

ఖమ్మం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని బల్లేపల్లి రెవెన్యూలో సర్వే నెంబర్ 137, 138లో జరిగిన ఆక్రమణల వ్యవహారంపై గురువారం విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. దొంగ అసెస్‌మెంట్ల ద్వారా అమ్మకాలు, కొనుగోలుకు వీలుకాని అసైన్డ్ భూములకు హక్కులు పొందిన అంశంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరా తీశారు. ఖమ్మం వైఎస్‌ఆర్ నగర్ నుంచి రఘునాథపాలెం వెళ్లే మార్గంలో, వైఎస్‌ఆర్ నగర్‌కు ఆనుకుని వేపకుంట్ల వెళ్లే మార్గంలో ఉన్న పలు నిర్మాణాలకు సంబంధించి విచారణ నిర్వహించారు. ఖమ్మం అర్బన్ మండల రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులను పిలిపించి సర్వే నిర్వహించారు. రెండు సర్వే నెంబర్లలో ఎంత భూమి ఉంది, ఎంత భూమి ఆక్రమణకు గురైందనే విషయంపై కొలతలు వేశారు. నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయి? బిల్డింగుల్లో ఎన్ని గదులు, ఎన్ని అంతస్థులు లాంటి అంశాలను పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి పలు రికార్డులను పరిశీలించి.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపు, నియామకాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూమి బదలాయించడానికి వీలులేని వాటికి ఏకంగా అసెస్‌మెంట్లు వేసి ఇంటి నెంబర్లు కేటాయించడం, ఆయా అసైన్డ్ భూముల్లో గెస్ట్‌హౌజ్‌ల పేరుతో పెద్ద ఎత్తున భవంతులు నిర్మించడం లాంటివి జరుగుతున్నప్పటికీ పట్టించుకోవడం వెనుక కారణాలేంటి అన్న అంశాలను విశ్లేషించినట్టు తెలిసింది. ముందుగా అసెస్‌మెంట్లు వేసి వాటి ఆధారంగానే విద్యుత్ మీటర్లు, ఇతర కార్యకలాపాలు సాగించినట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించినట్టు తెలుస్తోంది. సదరు అసెస్‌మెంట్లు ఎవరు వేశారు, అసెస్‌మెంట్లు వేసిన అధికారులు ఎవరు? అన్న వివరాలను సేకరించారు. కాగా ప్రస్తుతం ఆయా అధికారులు ఖమ్మంలో పనిచేయడం లేదని విజిలెన్స్ అధికారులకు స్థానిక అధికారులు చెప్పినట్టు సమాచారం. అయితే దొంగ అసెస్‌మెంట్ల ద్వారా అసైన్డ్ భూములకు ఎసరు పెట్టిన విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

సాగు యోగ్యమైన ప్రతీ ఎకరాకు రైతు భరోసా



నర్సింహుల గూడెంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచి మండలంలో పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

కూసుమంచి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సాగుకు ఆయోగ్యమైన ప్రతీ ఎకరానికి రైతుభరోసా అందిస్తామని.. దీనిపై రైతులు అనుమానపడాల్సి అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి గురువారం ఆయన కూసుమంచి మండలంలో పర్యటించారు. నర్సింహులగూడెం, పూర్యాతండ, చింతలతండాలో, పోచారంలో కూసుమంచిలో బీటీ రహదారులు, సీసీ రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే కూసుమంచి మండలకేంద్రంలో మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహులగూడెం గ్రామంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ.. ఎన్నికల్లో తాము ప్రజలకు ఇచ్చిన హామీలను అన్నిటినీ నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. గృహవిద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు, రూ.10లక్షలకు ఆరోగ్యశ్రీ, గురుకులాల్లో డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు, సన్న రకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్, రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల లాంటి ప్రజాకర్షక పథకాలు అమలుచేస్తున్నట్లు పేర్కొన్నారు. గత పాలకులు చేసిన భారీ అప్పులు చెల్లిస్తూ పేదల ఇంటికల నెరవేరుస్తున్నట్లు వివరించారు. దశలవారీగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఆందోళన పడొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాహుల్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి

కూసుమంచిలో జరిగిన రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకల్లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన కేక్‌కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ మంచి విజన్ ఉన్న నాయకుడని, యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నిరంతరం అన్ని సామాజికవర్గాలకు సమన్యాయం జరగాలని పోరాడుతున్నారని తెలిపారు.



మావోయిస్టులూ జన జీవన స్రవంతిలో కలవండి

- ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని పొందండి
- భద్రాద్రి ఎస్పీ పిలుపు
- 12 మంది మావోయిస్టు దళసభ్యుల లొంగుబాటు 7

సంగీతం.. సకల జన సమ్మతం

- విరాజిల్లుతున్న ఖమ్మం జిల్లా.. 6
- రేపు ప్రపంచ సంగీత దినం

విపత్తుల వేళ.. ఇదేం తీరు?

- ఒకే వాహనంతో రెండు డీఆర్‌ఎఫ్ బృందాల కుస్తీ
- పక్షం రోజులుగా మూలనపడిన వైనం
- పనిముట్లు సమకూర్చలేక పోతున్న అధికారులు
- ఇంజనీరింగ్ విభాగం నుంచి కదలని ఫైళ్లు



సరైన యూనిఫాం కూడా లేని డీఆర్‌ఎఫ్ బృందం

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : విపత్తుల వేళ ప్రజల్ని రక్షించేందుకు అన్ని రంగాల్ని విభాగాలను సిద్ధం చేయాల్సిన ఖమ్మం నగర పాలక సంస్థ అధికారుల తీరు విస్మయానికి గురిచేస్తోంది. విపత్తుల సమయం సమీపించేకొద్దీ వారి పనితీరు గందరగోళంగా మారింది. ఖమ్మం నగర ప్రజలను విపత్తుల నుంచి రక్షణ కల్పించడంతో పాటు.. సాధారణ రోజుల్లో అత్యవసర పనులకు వినియోగించేందుకు 2020ఆగస్టు 8న 20మంది సిబ్బందితో డిజాస్టార్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్)ను ఏర్పాటు చేశారు. తర్వాత పది రోజులు పాటు శిక్షణనిచ్చి వారికి విధులకు కేటాయించారు. ఐదేళ్ల కాలంలో పలు విపత్తుల సమయాల్లో, అనుమతి లేని నిర్మాణాలు, వ్యాపార సముదాయాలను తొలగించడంలో డీఆర్‌ఎఫ్‌లోని రెండు బృందాలు విశేష కృషి చేస్తున్నాయి. అయితే ఇటీవల కాలంలో డీఆర్‌ఎఫ్ వాహనాలు మరమతులకు గురైనా పట్టించుకోవటం లేదు. దీంతో ఒకే వాహనంతో రెండు బృందాలు కుస్తీ పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు బృందాలకు రోజువారీగా పనిచేసేందుకు కావాల్సిన పనిముట్లను అధికారులు సమకూర్చలేక పోతున్నారు. దీంతో డీఆర్‌ఎఫ్ ఏర్పాటు లక్ష్యాలు దెబ్బతింటుండగా.. విపత్తులు ఏర్పడితే చేతులెత్తేసే పరిస్థితి వచ్చింది.

విభాగాల మధ్య సమన్వయలోపం.. కదలని ఫైళ్లు

రెండు వాహనాలతో రెండు డీఆర్‌ఎఫ్ బృందాలను ఏర్పాటు చేసిన ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు ప్రారంభంలో డీఆర్‌ఎఫ్‌ను బలోపేతం చేసే చర్యలు తీసుకున్నారు. పూర్వ కమిషనర్ ఆదర్శ సురభి పనిచేసిన కాలంలో డీఆర్‌ఎఫ్ సిబ్బందికి యూనిఫాం, కటింగ్ మిషన్లు, గొడ్డళ్లు, లిచ్చెనలు, కొడవళ్లు, చెయిన్లు, తాళ్లు లాంటి వస్తువులను ఎప్పటికప్పుడు అందించారు. ప్రతీ రోజు వినియోగించడంతో అవి అరిగిపోయి, మరమతులకు చేరాయి. కాగా కొంత కాలంగా కేఎంసీలోని డీఆర్‌ఎఫ్ విభాగం అధికారులు, ఇంజనీరింగ్ విభాగం (మిగతా 6వ పేజీలో)



వార్షిక రుణప్రణాళికను ఆవిష్కరించిన కలెక్టర్, ఇతర అధికారులు

భద్రాద్రి జిల్లా రుణ ప్రణాళిక రూ.7,700.87కోట్లు

- ఖరారు చేసిన కలెక్టర్ జితేష్
- జిల్లా అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష

కొత్తగూడెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 7700.87కోట్ల రుణప్రణాళిక లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. గురువారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో కలెక్టర్ డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళికను ఖరారు చేశారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రైతులకు రుణాల పంపిణీ, (మిగతా 6వ పేజీలో)

సికిల్‌సెల్ అనీమియా నివారణలో
జిల్లాకు దేశంలోనే గుర్తింపు

- గ్రామాల్లో వైద్య సిబ్బంది తరచూ రక్త పరీక్షలు నిర్వహించాలి
- అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో శిబిరాలు పెట్టండి
- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్


ప్రసంగిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్ అనీమియా నివారణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ఏజెన్సీలో పని చేసే వైద్య సిబ్బంది గిరిజన ప్రాంతాల్లో తరచూ రక్త పరీక్షలు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భద్రాచలంలో గురువారం ప్రపంచ సికిల్‌సెల్ అనీమియా దినోత్సవం సందర్భంగా గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సికిల్‌సెల్ అనీమియా ప్రాణాంతక వ్యాధి కాదని, జన్యుపరమైన లోపాలతో తల్లిదండ్రుల నుంచి సంక్రమిస్తుందని తెలిపారు. త్వరగా గుర్తించి సరైన చికిత్సలు చేసుకుంటే ఎటువంటి వ్యాధులు దరి చేరవన్నారు. గర్భిణులు సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే సరైన వైద్యం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా పుడతారన్నారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గిరిజనుల ఆరోగ్యం విషయంపై ఎంతో శ్రద్ధ తీసుకొని కష్టపడి పని చేస్తున్నందున మన జిల్లాకు దేశంలో రికార్డుస్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. అలాగే పీహెచ్‌సీలలో ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టి మంచి పేరు తెచ్చారని, వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో సికిల్‌సెల్ అనీమియా టెస్టింగ్ క్యాంపులు నిర్వహించి వ్యాధి లక్షణాలుంటే చికిత్స అందించాలన్నారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన గ్రామాల్లోని గిరిజన పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించామని 2023 జూలై నుంచి ప్రారంభించడం జరిగిందన్నారు 2047 నాటికి ఈ వ్యాధిని పారద్రోలడానికి ప్రణాళికబద్ధంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో విస్తృతంగా వైద్య పరీక్షలు చేసి వ్యాధిని గుర్తించి వైద్య చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో బి.రాహుల్, డీఎంహెచ్‌వో భాస్కర్, ఏసీఎంవో రమణయ్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జయలక్ష్మి, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, సికిల్‌సెల్ ప్రోగ్రాం అధికారి మధుకర్, ఆర్ఎంవో రాజశేఖర్ పాల్గొన్నారు.

తాటి, ఈతవనాల పెంపకంపై దృష్టి

- ఈ ఏడాది వనమహోత్సవంలో మొక్కలు నాటేలా ప్రణాళిక
- ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులకు ఆదేశాలు


ఖమ్మం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో గీత కార్మికుల సంక్షేమం.. గీత వృత్తిని కాపాడేందుకు పలు చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఈ వర్షాకాలం వన మహోత్సవంలో మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందిస్తోంది. ఏటా నిర్వహించే కార్యక్రమానికి భిన్నంగా ఈ సారి తాటి, ఈత మొక్కలను నాటించడంపై దృష్టిసారించింది. ఇందుకు అవసరమైన మొక్కలను కూడా అధికారులు సిద్ధం చేశారు. తాటి, ఈతమొక్కలు పెంపకం ద్వారా చెరువులు, కాలువల గట్లకు బలం ఉండడంతో పాటు గీత కార్మికులకు కూడా ఉపాధికి అవకాశం ఉంటుందని భావించి ప్రభుత్వం ఈసారి వనమహోత్సవంలో తాటి, ఈత మొక్కలను అధికసంఖ్యలో నాటేందుకు నిర్ణయించింది. ఇటీవల ఖమ్మంలో సమీక్ష నిర్వహించిన బీసీ సంక్షేమం, ఎక్సైజ్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా జిల్లా అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. వనమహోత్సవంలో ఉపయోగం లేని మొక్కలు వేయవద్దని, వృత్తుల వారికి ఉపాధి చూపించే మొక్కలనే నాటాలని ఆదేశించారు. పండ్ల మొక్కలతోపాటు తాటి, ఈత మొక్కలను పెద్దఎత్తున నాటాలని సూచించారు. జిల్లా అధికారులు కూడా ఇందుకోసం కార్యాచరణ రూపొందించారు. జిల్లాలో చెరువుల కట్టల వెంట, ప్రాజెక్టుల కాలవలు, రాష్ట్రీయ, జాతీయ రహదారులు, ప్రభుత్వ ఖాళీ బంజర భూములోనూ తాటి, ఈత మొక్కలను ఈసారి నాటబోతున్నారు. జిల్లాలో డీఆర్‌డీవో వనమహోత్సవం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో 11.54 లక్షల పలు రకాల మొక్కలను నాటాలని నిర్ణయించారు. ఇందుకు మండలాల వారీగా కూడా నిర్ధారించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలో 3,02,410 మొక్కలు నాటాలని నిర్ణయించగా ఇప్పటికే 59,085 ఈత, తాటి మొక్కలు నాటారు. అన్ని మండలాల్లోనూ చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల కాలువలు, రహదారులు వెంట కూడా ఈత, తాటిమొక్కలు నాటబోతున్నారు. ఎక్సైజ్‌శాఖ పరిధిలోని ఆయా స్టేషన్లలో కూడా ప్రత్యేకంగా కోటా నిర్ణయించారు. జిల్లాలోని పలు మండలాల్లో 81,200 తాటి, ఈత మొక్కలు నాటనున్నారు. భద్రాద్రి జిల్లా పరిధిలో కూడా ఈ ఆర్థిక సంవత్సరంలో డీఆర్‌డీఏ ద్వారా 32.56లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఇందులో 2.50లక్షల ఈత, తాటి మొక్కలు వేయాలని నిర్ణయించగా ఇప్పటికే 35వేల మొక్కలు నాటారు. ఈ మొక్కలు సుదీర్ఘకాలంపాటు పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, గీత కార్మికులకు కల్లు గీత ద్వారా ఉపాధి, రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని అధికారులు భావించి ఈమొక్కలు నాటేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.


మహిళా కార్యకర్త నివాసంలో భోజనం చేస్తున్న రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు

దేశంలోనే ఆదర్శవంతంగా
సన్నబియ్యం పంపిణీ

- నిరుపేదలకు మూడు పూటలా భోజనం
- ఖమ్మంలో కార్యకర్త నివాసంలో భోజనం చేసిన మహిళా సునీతారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఆదర్శవంతంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని నిరుపేదలు కూడా మూడు పూటలా భోజనం చేస్తున్నారని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు పేర్కొన్నారు. గురువారం జిల్లా పర్యాటనకు వచ్చిన ఆమె ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్యతో కలిసి మహిళా కార్యకర్త నివాసంలో సన్నబియ్యంతో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మహిళా సాధికారిత కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ పథకాల అమలుపై వివరించారు. నాయకులు కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు దేవిప్రసన్న, నాయకులు సుగుణ, నేలవేణి, నస్సీమా, అన్నపూర్ణ, జ్యోతి, చంద్రిక పాల్గొన్నారు.



సంగీతం సకల జన సమ్మతం

21న ప్రపంచ సంగీత దినోత్సవం

మనసును ఆహ్లాదపరిచే శక్తి సంగీతానికి ఉంది. అన్ని వయస్సుల వారిని సంగీతం రాగ రంజితం చేస్తుంది. సంగీతం విశ్వభాష. ఏ భాషలోని సంగీతాన్నైనా ఇష్ట పడతాం. ఇంతటి విశిష్టత కలిగిన సంగీతానికి ప్రత్యేకంగా ఒక రోజు ఉండటం గమనార్హం. జూన్ 21న ప్రపంచ వ్యాప్తంగా సంగీత దినోత్సవాన్ని జరుపుకొంటారు. 1982లో ఫ్రాన్స్‌లో మొదలైన సంగీత దినోత్సవం అన్నిదేశాల్లో ఘనంగా జరుపుకొంటున్నారు. సంగీత కళాకారులను గౌరవించే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా ఒక రోజును ఏర్పాటు చేశారు. యువ సంగీత కళాకారులకు ప్రోత్సాహం తోపాటు సీనియర్ కళాకారులను సన్మానించటం ఈ రోజు ఉద్దేశ్యం..

- సంగీతం విశ్వభాష...
- కళాకారుల కుటుంబంగా విరాజిల్లుతున్న ఖమ్మం జిల్లా..

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో సంగీత కళాకారుల కుటుంబం అలరారుతోంది. గాయనీ గాయకులు, కీబోర్డు ప్లేయర్లు, ఫ్లూట్, తబలా కళాకారులు, వయోలిన్, గిటార్‌తో సంగీతాన్ని పలికించే వారు, నాదస్వరం, తదితర సంప్రదాయ సంగీత కళాకారులు ఉన్నారు. ఖమ్మం సకల కళల గుమ్మం కావటంతో కవులు, రచయితల తోపాటు సంగీత, గాన కళాకారులకు ఆదరణ లభిస్తోంది. గతంతో పోలిస్తే ఖమ్మంలో సంగీతాదరణ అధికమైంది. ఖమ్మంలో ఏడెనిమిది దాకా సంగీత సంస్థలు ఏడాది పొడవునా ఏదో ఒక సంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా డెబ్బయి ఎనభై మంది వరకు గాయనీగాయకులు గాత్ర సంగీతాన్ని అందిస్తున్నారు. భలే మంచి రోజు సంగీత సంస్థ ప్రతిఏటా ఘంటసాల పాటల కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తోంది. సినీ గాయనీ గాయకులను సైతం ఖమ్మానికి ఆహ్వానించి సంగీత స్థాయిని పెంచుతున్నారు. స్వరసుధ, స్వరమాధురి, స్వర మధురిమ, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్, సిరివెన్నెల మ్యూజిక్ అసోసియేషన్, పాషా మ్యూజిక్ అసోసియేషన్ వంటి సంగీత సంస్థలు ఖమ్మం ప్రజలకు సంగీతానుభూతిని కలిగిస్తున్నాయి. ప్రస్తుతం లైవ్ ఆర్కెస్ట్రాతో సంగీత కళాకారులే తమ సాధనాలతో సంగీతాన్ని అందిస్తుండటం విశేషం.

సంప్రదాయక సంగీతకారులు కూడా..

నాదస్వరం వంటి సంప్రదాయ సంగీతాన్ని అందిస్తున్న కళాకారులు కూడా ఖమ్మంలో సేవలందిస్తున్నారు. పెళ్లిళ్ల సందర్భంలో ఆలయాల్లో ఉత్సవాలకు డోలు, సన్నాయి, హార్మోని వంటి సంగీతాలను అందిస్తుండటంతోపాటు త్యాగరాయ ఉత్సవాలు తదితర సంప్రదాయ భక్తి సంగీత అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నారు.

పుట్టుక నుంచీ సంగీతమే...

చిన్నపిల్లలకు తల్లి పాడే జోల పాట మనిషి వినే మొదటి సంగీతం. ప్రతి సందర్భాల్లో సంగీతం మానవ జీవితంతో పెనవేసుకుపోయింది. పని పాటల్లో, కార్మికులు, కర్షకులు సంగీతాన్ని ఆలపించి తమ కష్టం మరిచిపోతారు. బారసాల నుంచి పెళ్లి వరకు సంగీతం ప్రతి సందర్భంలోనూ మనిషి వెన్నంటే ఉంటుంది. శిశుర్వేత్తి, పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిహీ అని సంగీతం యొక్క ప్రాధాన్యతను ఘనంగా చాటి చెప్పారు.

జిల్లా నుంచి పలువురు సంగీత దర్శకులు

సంగీత కారులు, గాయనీగాయకులతో పాటు ఉమ్మడి జిల్లానుంచి పలువురు సినీ సంగీత దర్శకులుగా ఎదిగిన వారున్నారు. కొత్తగూడేనికి చెందిన ఘంటాడి కృష్ణ తెలుగు సినీ సంగీతంలో తన ముద్ర వేశారు. అనేక హిట్ పాటలతో సంగీతాభిమానులను అలరించారు. ఖమ్మానికి చెందిన బల్లేపల్లి మోహన్, తదితరులు సినీ సంగీతంలో రాణించారు. లెనినా చౌదరి, శశిశ్రీ తదితర గాయనిమణులు సిని మాలకు పాటలు పాడారు.

సంగీతం మానవులకే కాదు పశువులు, పక్షులు, పాములను సైతం అలరిస్తుంది అని అర్థం.. నాగస్వరం విని పాములు నాట్యమాడటం మనకు తెలిసిందేకదా.. ఆధునిక కాలంలో కీబోర్డు సకల సంగీతాల నిలయంగా మారింది.. కీబోర్డు వంటి ఆధునిక సంగీత సాంకేతికత అందుబాటులోకి రావటంతో గాయనీ గాయకులు తమ గాత్ర సంగీతాన్ని ప్రదర్శించే అవకాశాలు అధికమయ్యాయి.



సంగీతానికి ఆదరణ పెరిగింది..

వీపీ రెడ్డి గాయకుడు



సంగీతానికి ఆదరణ ఇప్పుడు మరింత అధికమయ్యింది. ఏడాది పొడవునా దాదాపు యాభైకి పైగా సంగీత విభావరులు నిర్వహిస్తుండటం ఖమ్మంలో సంగీత ప్రియుల ఆదరాభిమానాలకు నిదర్శనం.. గతంలో ఒకటో రెండో సంగీత సంస్థలు ఉండేవి. ఇప్పుడు ఏడెనిమిది సంగీత కళాసంస్థలు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో అరవై డెబ్బయి మంది వరకు గాయనీ గాయకులు తమ గాన ప్రతిభను ప్రదర్శించే అవకాశం దక్కుతోంది. స్థానిక కళాకారులతోపాటు పలు జిల్లాల నుంచి కూడా కళాకారులు ఖమ్మం వచ్చి సంగీత కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

ఉత్తమ సంగీతానుభూతిని కలిగిస్తున్నాం..

మాధవరావు, స్వరసుధ సంగీత సంస్థ అధ్యక్షుడు



సంగీతాభిమానుల అభిరుచికి అనుగుణంగా ఉత్తమ సంగీతానుభూతిని కలిగించే కార్యక్రమాలను రూపొందిస్తున్నాం. ఇందుకోసం లైవ్ ఆర్కెస్ట్రాను ఉపయోగిస్తున్నాం. నేను కీబోర్డుతోపాటు మృదంగం వాయిస్తాను, పాటలు పాడుతాను. తబలా, మృదంగం, ఫ్లూట్ తదితర సంగీత వాద్యాల కళాకారులు ప్రేక్షకుల కళ్లెదుటే పాటకు అనువైన సంగీతాన్ని అందించి ఆకట్టుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా వాద్య, గాన కళాకారులను ఆహ్వానిస్తున్నాం.. దాతల సహాయ సహకారాలు కూడా సంగీత కార్యక్రమాలకు అందిస్తున్నారు.

145 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- ఖమ్మం జిల్లా నుంచి గజ్వేల్‌కు తరలుతుండగా స్వాధీనం


పట్టుకున్న రేషన్‌బియ్యం లారీతో వైరా ఎస్ఐ రామారావు, సిబ్బంది

వైరా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పేదల కోసం ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న 145క్వింటాళ్ల సన్నబియ్యాన్ని ఖమ్మం జిల్లాలోని కల్లూరు నుంచి గజ్వేల్‌కు అక్రమంగా తరలిస్తుండగా గురువారం ఉదయం ఖమ్మం జిల్లా వైరా పోలీసులు పట్టుకున్నారు. తమకందిన సమాచారం మేరకు వైరా ఎస్ఐ పుష్పాల రామారావు.. జాతీయ ప్రధాన రహదారిపై స్థానిక క్రాస్‌రోడ్డులోని మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించుకుపోతున్న ఏపీ29టీఏ7032నెంబర్ గల లారీని పట్టుకున్నారు. ఆ తర్వాత లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జయంతి గ్రామానికి చెందిన రామారావు అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని అక్రమంగా గజ్వేల్‌కు తరలిస్తున్నారని విశ్వసనీయవర్గాల సమాచారం. రామారావు అనేక సంవత్సరాలుగా ఖమ్మంజిల్లాలో అక్రమంగా రేషన్‌బియ్యం వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తూ పోలీసులకు, పౌరసరఫరాలశాఖ అధికారులకు దొరికిన సంఘటనలున్నాయి. అయితే ఆయా సందర్భాల్లో వ్యవస్థను మేనేజ్ చేసి 6ఏ లాంటి నామమాత్రపు కేసులతో తప్పించుకొని రేషన్ డాన్‌గా మారాడనే ఆరోపణలున్నాయి. కల్లూరు సమీపంలోని ఓ మామిడితోటలో గురువారం తెల్లవారుజామున రేషన్ బియ్యాన్ని లారీలో లోడ్ చేయగా.. ఆ లారీ గజ్వేల్‌కు తరలివెళ్తుండగా వైరా పోలీసులకు పట్టుబడింది. ఈ బియ్యం శాంపిల్స్ తీసి పరీక్ష కోసం పౌర సరఫరాలశాఖకు పోలీసులు పంపించారు. బియ్యం పరీక్షల నివేదిక రాగానే విచారణ చేసి బియ్యం అక్రమ రవాణాకు సంబంధించిన వారిపై కేసులు నమోదు చేస్తామని వైరా ఎస్ఐ రామారావు తెలిపారు.

మణుగూరు మండలంలో 45క్వింటాలు

మణుగూరు టౌన్ : భద్రాద్రి జిల్లా మణుగూరు మండలంలోని వాగు మల్లారం గ్రామంలో పోతుల వెంకట్ ఇంట్లో నిల్వ చేసిన 30 బస్తాల పీడీఎఫ్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ డీటీ శివకుమార్ గురువారం పట్టుకున్నారు. 30 బస్తాల్లో నిల్వ ఉంచిన 15 క్వింటాల బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమెదు చేసినట్లు ఆయన తెలిపారు.

మణుగూరు మండల పరిధిలోని అశోక్ నగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి ఆదేశాల మేరకు సీఐ నాగబాబు ఎస్ఐలు రంజిత్, ట్రైనీ ఎస్ఐ మనీషా, ఏఎస్ఐ జ్యోతి, కానిస్టేబుల్ కోటి మురారిలు ఈ స్థావరాలపై దాడులు చేసి అశోక్ నగర్‌లో బి సత్యం ఇంట్లో 20 క్వింటాలు, రాజీవ్‌గాంధీ నగర్‌లో కొండి వీరభద్రం ఇంట్లో 10 క్వింటాల బియ్యాన్ని పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగబాబు తెలిపారు.

విపత్తుల వేళ.. ఇదేం తీరు?

(5వ పేజీ తరువాయి)


మరమ్మతులకు గురైన డీఆర్‌ఎఫ్ వాహనం

అధికారుల మధ్య సమన్వయం లోపం కనిపిస్తోంది. వాహనాల మరమతుల నుంచి యూనిఫాంలు, కనీసం తాళ్ల కొనుగోలు వరకు డీఆర్‌ఎఫ్ నుంచి వెళ్లిన ఫైళ్లను ఇంజనీరింగ్ అధికారులు ముందుకు సాగనివ్వటం లేదన్న విమర్శలున్నాయి. రెండు విభాగాల అధికారుల మధ్య ఏర్పడిన దూరమే కారణమన్న ఆరోపణలున్నాయి. కేఎంసీలోని ఏ విభాగం వారైనా నేరుగా ఫైల్స్ పట్టుకొని ఇంజనీరింగ్ అధికారుల చాంబర్లకు తిరిగితేనే ఫైల్స్ ముందుకు సాగే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఒకటికి రెండు సార్లు ఫైల్స్ పెట్టిన డీఆర్‌ఎఫ్ అధికారులు తర్వాత వదిలేశారు.

పక్షం రోజులుగా నిలిచిన వాహనం

డీఆర్‌ఎఫ్‌లో రెండు వాహనాలుండగా పక్షం రోజుల క్రితం ఒక వాహనం మరమతులకు గురైంది. ఈ విషయాన్ని ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారు సరిగా స్పందించలేదు. దీంతో వాహనం కార్యాలయంలోనే మూలకు చేరింది. గత రెండున్నరేళ్లుగా డీఆర్‌ఎఫ్ సిబ్బందికి యూనిఫాం ఇవ్వలేదు. దీంతో వారు సాధారణ దుస్తులతో బయట పనులు చేయడంతో వారిని డీఆర్‌ఎఫ్ బృందాలుగా ప్రజలు గుర్తించటం లేదు. అక్రమ నిర్మాణాలు కూల్చివేత సమయంలో మీరు ఎవ్వరనే ప్రశ్నలను డీఆర్‌ఎఫ్ బృందాలు ఎదుర్కొంటున్నాయి. డీఆర్‌ఎఫ్ బృందాలకు ఇక సరైన కటింగ్ మిషన్లు, చైన్లు, గొడ్డళ్లు, లిచ్చెనలు లేకపోవడంతో ఒకరిద్దరు పనిచేస్తుంటే మిగిలిన వారు మాత్రం వారివైపు చూస్తూ ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేఎంసీ పాలకవర్గంతో పాటు కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించి వాహన మరమతులు చేయించి డీఆర్‌ఎఫ్ బృందాలకు సౌకర్యాలు సమకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాలుడి గొంతులో ఇరుక్కున్న ప్లాస్టిక్ బుల్లెట్

- అరుదైన ఆపరేషన్‌తో తొలగించిన ఖమ్మం వైద్యులు
- బాధిత చిన్నారిది మహబూబాబాద్ జిల్లా పాతపోచారం




బాలుడిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల వయసున్న ఓ బాలుడు ఆడుకుంటున్న క్రమంలో గొంతులో ప్లాస్టిక్ ఆట తుపాకీ బుల్లెట్ ఇరుక్కుపోయి నానా అవస్థలు పడ్డాడు. ఈ క్రమంలో ఖమ్మానికి చెందిన ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ఎంజీవీ ప్రవీణ్ అత్యంత చాకచక్యంగా ఆపరేషన్ చేసి ఆ బాలుడికి ఊపిరి పోశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలివీ.. మహబూబాబాద్ జిల్లా పాత పోచారం గ్రామానికి చెందిన పి.షణ్ముఖ్ అనే మూడేళ్ల బాలుడు సుమారు ఏడాది కిందట ఇంటి వద్ద బొమ్మ తుపాకీతో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు ప్లాస్టిక్ బుల్లెట్ గొంతులోకి వెళ్లి పైభాగంలో ఇరుక్కుపోయింది. ఆ తర్వాత ఆ బాలుడికి తీవ్రంగా గొంతు నొప్పి తీవ్రంగా రావడం, ఆహారాన్ని సరిగ్గా తినలేకపోతుండటంతో తల్లిదండ్రులు ఏడాదిగా వివిధ ఆస్పత్రుల్లో చూపించారు. ఆయా ఆస్పత్రుల్లో పరీక్షలు చేసినప్పటికీ సక్రమంగా గుర్తించకపోవడంతో.. ఈ నెల 18న గురువారం ఖమ్మంలోని ప్రవీణ్ ఈఎన్టీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ బాలుణ్ని పరీక్షించారు. ఎండో స్కోపీ విధానంలో పరీక్ష చేయగా.. గొంతులో కాకుండా ముక్కు అంగిటి భాగం నుంచి కపాలం మెదడు భాగం వైపు ఏదో చిన్న వస్తువున్నట్టు గుర్తించారు. తక్షణమే సీటీ స్కాన్ చేయించగా.. ఓ ప్లాస్టిక్ వస్తువు ఉన్నట్టు నిర్ధారణైంది. అయితే ఏడాదిగా ఆ వస్తువు అక్కడే ఉండడంతో దాని చుట్టు కొత్తగా చర్మం కూడా వచ్చి పూడుకు పోయింది. ఈ విషయాన్ని గుర్తించిన డాక్టర్ ప్రవీణ్‌కుమార్ రెండు గంటల పాటు శ్రమించి ఆపరేషన్ నిర్వహించారు. అత్యంత క్లిష్టమైన ప్రదేశం నుంచి ప్లాస్టిక్ బుల్లెట్‌ను బయటికి తీశారు. ఆ బుల్లెట్ సుమారు 2 సెంటీమీటర్లు ఉండగా.. మరి కొన్ని నెలల పాటు అక్కడే అలాగే ఉంటే అతి సున్నితమైన మెదడుకు రక్తం సరఫరా చేసే నాళాలను డ్యామేజ్ చేసే ఆస్కారం ఉండేదని డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ ద్వారా ప్లాస్టిక్ బుల్లెట్‌ను తొలగించి బాలుడిని ప్రాణాపాయం నుంచి కాపాడగలిగామని తెలిపారు. ఆ బాలుడిని రెం డురోజుల పరీక్షల అనంతరం గురువారం క్షేమంగా ఇంటికి పంపించినట్టు తెలిపారు. తన కుమారుడిని ప్రాణాప్రాయం నుంచి కాపాడిన డాక్టర్ ప్రవీణ్ కుమార్, అనస్తీషియా డాక్టర్ సురేష్‌కు బాలుడి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రిస్క్ లేకుండా.. రాకుండా..

(5వ పేజీ తరువాయి)

జానంపేట, మోరంపల్లి బంజర, నర్సపురం, దుమ్ముగూడెం, చర్ల, మణుగూరు, అశ్వాపురం, పర్ణశాల, సత్యనారాయణపురం పీహెచ్‌సీలకు గర్భిణులను తొలి ప్రమాద హెచ్చరిక సమయానికి చేరుస్తారు. ఈ క్రమంలో సాధారణ ప్రసవం సాధ్యమవుతుందని భావించిన గర్భిణులను అక్కడే ఉంచి వారికి ప్రసవం నిర్వహిస్తారు. వరదల సమయంలో 24గంటల పీహెచ్‌సీతో పాటు సాధారణ పీహెచ్‌సీలు కూడా 24 గంటలు వైద్యసేవలందించేందుకు సిద్ధంగా ఉంటాయని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. చర్ల, సత్యనారాయణపురం, దుమ్ముగూడెం, పినపాక 24గంటల వైద్యశాలలతో పాటు మణుగూరు ఏరియా వైద్యశాలలో బర్త్ వెయిటింగ్ సిద్ధంగా ఉండటంతో అందులో గర్భిణులను ఉంచి వైద్యం అందిస్తారు. ఇదిలా ఉండగా రెండో ప్రమాద హెచ్చరిక 48అడుగులకు చేరగానే ఎవరైతే హైరిస్క్ గర్భిణులున్నారో వారిని సమీప భద్రాచలం, మణుగూరు ఏరియా వైద్యశాలలకు తరలించి ప్రసవం చేస్తారు. కొన్ని సందర్భాల్లో ఊహించని రీతిలో ముందస్తుగా ప్రసవ వేదనకు గురవుతున్న వారిని గుర్తించి హెలికాప్టర్, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది ద్వారా ప్రత్యేక పడవల్లో ఏరియా వైద్యశాలకు తరలించిన ఘటనలు గతంలో ఎన్నో ఉన్నాయి.

హైరిస్క్‌లో ఉన్న వారు 84 మంది

నదీ పరివాహక ప్రాంత పరిధిలోని పది పీహెచ్‌సీల్లో 230 మంది గర్భిణులకు జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ప్రసవం వచ్చే అవకాశాలున్నట్టు వైద్యశాఖ సిబ్బంది గుర్తించారు. తమ పీహెచ్‌సీల పరిధిలో ఉన్న గర్భిణులను ముందస్తుగానే వారు గుర్తించారు. అలాగే ఇందులో 84 మంది హైరిస్క్ గర్భిణులు అంటే బీపీ, గుండె సంబంధిత సమస్యలు, గతంలో సిజేరియన్ ద్వారా ప్రసవం జరిగిన వారిని గుర్తించి ముందస్తుగా వారిని భద్రాచలం, మణుగూరు ఏరియా వైద్యశాలలకు పంపనున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం భద్రాచలం ఏరియా వైద్యశాలలో బెడ్లను ప్రత్యేకంగా గర్భిణులకు కేటాయించినట్టు వారు తెలిపారు. అలాగే మణుగూరు ఏరియా వైద్యశాలలో బెడ్లు సైతం సిద్ధంగా ఉంచినట్టు పేర్కొన్నారు.

ధాన్యం దందాపై
అధికారుల ఆరా!

(5వ పేజీ తరువాయి)

చైర్మన్‌ను సస్పెండ్ చేసి వారిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. అది మరిచిపోకముందే సొసైటీలో మళ్లీ ధాన్యం దందా మూడు పూలు.. ఆరు కాయల చందంగా సాగుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. కష్టించి పండించిన అన్నదాతల కష్టాన్ని అడ్డగోలుగా తరుగు పేరుతో లూటీ చేయడంపై జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై జిల్లా సహకార సంఘం అధికారులతో పాటు ఇంటిలిజెన్స్, విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. అన్యాయానికి గురైన బాధిత అన్నదాతలు కలెక్టర్‌ను కలిసి వారికి జరిగిన మోసాన్ని వివరించి సహకార సంఘం అధికారులు, సిబ్బంది, మిల్లర్లపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

రామయ్యకు బంగారు హారం అందజేత

భద్రాచలం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన ఎం.కృష్ణ చైతన్య, రాజ్యలక్ష్మి దంపతులు 52.25 గ్రాముల విలువైన బంగారు హారంను గురువారం అందజేశారు. రూ.4,98,520 విలువైన హారంను వారు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి ఆలయ ఆవరణలో అందజేశారు.


బంగారు హారాన్ని అందజేస్తున్న దృశ్యం

భద్రాద్రి జిల్లా రుణ ప్రణాళిక
రూ.7,700.87కోట్లు

(5వ పేజీ తరువాయి)

స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పీఎం, జీపీపై రుణాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు రూ.5242.49కోట్లకు గాను రూ.3,960.63కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. వివిధ పథకాల్లో మంజూరైన రుణాల రికవరీపై శ్రద్ధ వహించాలని కోరారు. యువతకు ఉపాధి కల్పించే విషయంలో చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళికను రూ.7,700.87 కోట్లతో కలెక్టర్ ఆవిష్కరించారు. వ్యవసాయ అవసరాల కోసం రూ.3,838.00కోట్లు ఎంఎస్ఎంఈ కింద రూ.847.80కోట్లు ఇతర రంగాలకు రూ.4,883.99కోట్ల రుణాలుగా బ్యాంకర్లు అందచేయాలని కోరారు. రుణాలకోసం బ్యాంకులకు వచ్చే రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అర్జించే పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు వేదిక వద్ద బ్యాంకు అధికారులు శిబిరాలు ఏర్పాటు చేసి రైతులకు రుణ సహాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి, పరిశ్రమలశాఖ మేనేజర్ తిరుపతయ్య, పశుసంవర్ధకశాఖ డీడీ వెంకటేశ్వర్లు, అన్ని బ్యాంకుల మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్!




ఈర్లపూడిలో ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టిన దృశ్యం

- వారంలో 11 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ
- పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆగని దొంగతనాలు
- ఆందోళనలో గిరిజన రైతులు

రఘునాథపాలెం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ముందస్తుగా వర్షాలు కురిసి ఏరువాక పౌర్ణమితో ఎంతో సంతోషంతో వ్యవసాయ పనులు ప్రారంభించిన గిరిజన రైతులు వారం రోజులుగా రాత్రి సమయంలో కునుకు లేకుండా ఉంటున్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని దాదాపుగా అన్ని చెరువులకు సాగర్ జలాలు అందాయి. ఒక వైపు ఆ సంతోషంలో ఉన్నా మరో వైపు చోరీల భయం వెంటాడుతుంది. రాత్రి సమయంలో కునుకు తీయాలంటే వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు రైతుల కలలో కనబడుతున్నాయి.

ఖమ్మం అర్బన్‌గా ఉన్న ప్రాంతాన్ని రఘునాథపాలెంగా మార్పు చేశారు. నగరంతో అనుసంధానంగా ఉండటం, రాగి తీగలకు గిరాకీ ఎక్కువగా ఉండటంతో పాటుగా ఖమ్మం నగరంలోని పాత ఇనుము సామాన్ల దుకాణాలపై సరైన పర్యవేక్షణ లేక పోవడంతో రఘునాథపాలెం మండలంలోని రైతులకు శాపంగా మారింది. ఖమ్మం నగరానికి సమీపంగా ఉండటం మారుమూల ప్రాంతాల వరకు రహదారుల విస్తరణ జరపడంతో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు దొంగలకు అనుకూలంగా మారింది. గత వారం రోజులుగా వరసగా గిరిజన రైతుల వ్యవసాయ భూముల నుంచి ట్రాన్స్‌పార్మర్లను రాత్రి సమయంలో దొంగలు తొలగించి వాటిని పగల గోడుతున్నారు. ట్రాన్స్‌పార్మర్‌లోని విలువైన కాపర్ వైర్లు, ఇతర విద్యుత్ పరికరాలను దొంగలిస్తున్నారు. మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు అనే భేదం లేకుండా అందినకాడికి ట్రాన్స్‌పార్మర్లను చోరీలు చేస్తున్నారు. ఇలా గణేశ్వరంలో-1, రఘునాథపాలెంలో-4, ఈర్లపూడిలో-4, హర్యాతండాలో-2 ట్రాన్స్‌పార్మర్లు చోరీలు జరిగాయి. వీటిలో 16కేవీఏ, 25కేవీఏ విద్యుత్ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌పార్మర్లు ఉన్నాయి.

గణేశ్వరంలో మొదటి వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగిన వెంటనే స్థానిక సీఐ ఉస్మాన్ షిరఫ్‌కు విద్యుత్ ఏడీఈ సంజీవ్ రావు రాత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. కొంత ప్రాథమిక సమాచారం కూడా అందించారు. తర్వాత వరస చోరీలు జరుగుతూనే ఉన్నాయి. వారంలో 11 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీలకు గురికావడంతో రైతులు, విద్యుత్‌శాఖ అధికారులు కలవరపాటుకు గురవుతున్నారు. జిల్లా పోలీసు అధికారులు స్పందించి ట్రాన్స్‌పార్మర్ దొంగలను పట్టుకొని కట్టడిచేయాలని మండల గిరిజన రైతులు కోరుతున్నారు.

రెండు గ్రామాల మధ్య పోడు వివాదం

దుమ్ముగూడెం జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చింతగుప్ప, జిన్నెలగూడెం గ్రామాల ఆదివాసీల మధ్య గురువారం పోడు భూముల వివాదం జరిగింది. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు తమ వద్ద ఉన్నాయంటూ రెండు గ్రామాల ఆదివాసీలు ఒకరు దున్నిన భూమిని మరొకరు దున్నారు. వివాదం చిలికి చిలికి గాలివాన అవడంతో రెండు గ్రామాల ఆదివాసీలు ఒకరిపై ఒకరు ఘర్షణకు దిగి భౌతికదాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐ అశోక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి ఇరుగ్రామాల ఆదివాసీలతో మాట్లాడి ఘర్షణలను నివారించారు. ఆదివాసీల దగ్గర ఉన్నాయంటున్న పోడుభూముల పట్టాలను పోలీస్‌స్టేషన్‌కు వచ్చి చూపించాలన్నారు. సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని తెలపడంతో గ్రామస్థులు వెనుదిరిగారు. కాగా పత్తి గింజలు వేసే సమయంలో గత నాలుగైదు ఏళ్లుగా ఈ రెండు గ్రామాల మధ్య పోడుభూముల వివాదం ఏటా జరుగుతోంది.

అంకిత భావంతో పని చేసి ప్రశంసలు పొందాలి

- రాష్ట్ర టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, కలెక్టర్ జితేష్ వి పాటిల్



వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న అజయ్‌కుమార్, కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో పని చేసి ప్రశంసలు పొందాలని టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయకుమార్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. గురువారం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రుల్లో అన్ని వార్డులు, ఓపీ రూమ్స్, డయాలసిస్ వార్డు, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ స్టోర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. 50 పడకల ఆసుపత్రి అయినప్పటికీ వంద పడకల ఆసుపత్రి స్థాయిలు సేవలు అందిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్వంచ పట్టణంలో ఒక ఫంక్షన్ హాలులో జిల్లాలోని భద్రాచలం, చర్ల, అశ్వారావుపేట, బూర్గంపాడు, మణుగురు, ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బందికి ప్రశంసపత్రాలు అందించారు. ముందుగా చికిత్స పొంది ఆరోగ్యంగా ఉన్న వారి నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సిబ్బంది మరింత బాధ్యతగా అంకితభావంతో రోగులకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి సిబ్బంది అద్భుతంగా సేవలను అందిస్తున్నారని అన్నారు. మారుమూల ప్రాంతాలైన కూడా అంకితభావంతో పని చేసి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని వారి సేవలను కొనియాడారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, ఆ వృత్తిలో వైద్య సిబ్బందికి మాత్రమే ప్రాణాలు నిలపెట్టే అవకాశం ఉందన్నారు. ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా సేవలు అందించాలన్నారు. జిల్లాలోని అన్ని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో సూపరింటెండెంట్లు ఇతర వైద్య సిబ్బంది చాలా కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, జిల్లాలోని వైద్య, విధాన పరిషత్ సూపరింటెండెంట్లు, నర్సింగ్, పారామెడికల్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధాలను ప్రోత్సహిస్తున్న అమెరికా

- ఇరాన్- ఇజ్రాయిల్ యుద్ధంపై ప్రధాని మోదీ నోరు మెదపాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం యుద్ధాలను ప్రోత్సహిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. గురువారం కొత్తగూడెం పట్టణంలో ఇజ్రాయిల్‌పై జరుగుతున్న దాడులను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. బస్టాండ్ సెంటరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్‌పై జరుగుతున్న దాడుల వల్ల లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులవుతున్నారని ఆవేదన చెందారు. అమెరిక ప్రోత్సాహంతోనే ఇజ్రాయిల్‌పై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇరాన్.. ఇరాక్ యుద్ధంపై ప్రధాన మంత్రి తన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు లిక్కి బాలరాజు, కంచర్ల జమలయ్య, సురేందర్, లక్ష్మి, కల్తి వెంకటేశ్వర్లు, జాటోత్ కృష్ణ, మాచర్ల సత్యం పాల్గొన్నారు.

దోస్త్ గడువు పొడిగింపు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దోస్త్ మూడో విడత ప్రవేశాల గడువు ఈ నెల 25 వరకు పొడిగించినట్లు ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకీరూల్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. మూడు విడతలలో సీట్లు పొందిన వారికి ఈ నెల 28 నుంచి జూలై 1 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని దోస్త్ కోఆర్డినేటర్ సలీం పాషా తెలిపారు.

భద్రాచలం డీ అడిక్షన్ సెంటర్ పరిశీలన



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కర్

భద్రాచలం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని డీ అడిక్షన్ కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్స అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ కేంద్రంలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం కేంద్రం నిర్వాహకులు డాక్టర్ ఉదయ్ చికిత్సకు అనుసరించే అంశాలను వివరించారు. రోగులు వారి వైఖరి, ప్రవర్తనలను మార్చుకోవడంలో కౌన్సిలింగ్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. దీర్ఘకాలికంగా కోలుకోవడానికి దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ చైతన్య, డిప్యూటీ డీఈఎంవో ఫైజ్మోహియుద్దీన్, సీహెచ్‌వో బి.సోమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇల్లెందుకు మంత్రి పొంగులేటి రాక

ఇల్లెందు టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధం కోసం శనివారం ఇల్లెందులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డా డానియేల్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సమరశంఖం పూరించేందుకు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఇల్లెందు పట్టణంలోని జేకే కాలనీ సింగరేణిపాఠశాల గ్రౌండ్‌లో భారీ సభను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సభకు మంత్రి పొంగులేటి హాజరుకానున్నారని పేర్కొన్నారు. సభకు ఇల్లెందు మున్సిపాలిటీలోని కాంగ్రెస్ కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

గ్రామ్ ఉత్కర్ష అభియాన్ క్యాంపుల ఏర్పాటు

భద్రాచలం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దార్తి అబాజాన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ యోజన శిబిరాలు జిల్లాలోని 10 మండలాల్లోని 11 గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. ఈ గ్రామసభల్లో గిరిజనులు వివిధ పథకాలకు నమోదుకు సంబంధించిన కార్డుల రిపోర్టు అధికారుల ద్వారా తెప్పించడం జరిగిందని అన్నారు. ఈ సదస్సులకు 2008 మంది గిరిజనులు పీఎం కిసాన్, ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కులం సర్టిఫికెట్లు, ఎన్ఆర్ఈజీఎస్ కార్డుల కోసం పేర్లు నమోదు చేసుకోగా 854 మందికి రిజిస్ట్రేషన్ చేశామన్నారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేయించడం జరిగిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కొణిజర్ల, జూన్19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీగలబంజర వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. తీగలబంజర గ్రామానికి చెందిన సయ్యద్ గోరీబి(53) గురువారం ఉదయం సమయంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ పొలానికి వెళ్తుండగా ఆమె వెనుక నుంచి కొణిజర్ల వైపు వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలి భర్త జానీమియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎత్తిపోతల పథకం పైపుల చోరీ

చింతకాని, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలోని తమ్మలమ్మ చెరువు ఎత్తిపోతల పథకం పైపులను గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు గురువారం పైపులు చోరీ చేసి ఉండటాన్ని గుర్తించి ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు.

అమరావతినగర్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాండురంగాపురం పరిధిలోని అమరావతి నగర్‌లో గురువారం స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికంగా ఉన్న చెత్త కుప్పకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. కాగా మంటలు పెద్దగా అవ్వడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకోని మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనలో ఎటువంటి ఆస్తి నష్టం జరగలేదని తెలిపారు.

మావోయిస్టులూ జనజీవన స్రవంతిలో కలవాలి

- 12మంది మావోయిస్టు దళసభ్యుల లొంగుబాటు
- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని, కలిసినటువంటి మావోయిస్టులకు ప్రభుత్వం అందజేసే ఆర్థిక సహాయాన్ని పొంది వారి కుటుంబాలతో సుఖ సంతోషాలతో గడపాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ మావోయిస్టులకు పిలుపునిచ్చారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని హేమచంద్రాపురం గ్రామంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వద్ద ఎస్పీ, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సమక్షంలో ఆపరేషన్ చేయూతన కార్యక్రమం సందర్భంగా వివిధ క్యాడర్‌లో పని చేస్తున్న 12మంది నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులు లొంగిపోయారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్‌శాఖ కల్పిస్తున్న సదుపాయాల గురించి తెలుసుకుని నక్సలిజాన్ని విడనాడి ఇకపై తాము కూడా కుటుంబసభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలనే ఆలోచనతో నిర్ణయించుకుని 12మంది మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులు లొంగిపోయారని తెలిపారు. వీరిలో ముగ్గురు మహిళా సభ్యులు ఉన్నారని, మిగిలిన వారంతా వివిధ క్యాడర్‌లో పని చేస్తున్న దళసభ్యులుగా ఉండి లొంగిపోయారని తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 294మంది మావోయిస్టు దళసభ్యులు వివిధ హోదాలో పని చేశారని, వారికి జనజీవన స్రవంతిలో కలిపి తగిన పునరావాస సౌకర్యాన్ని కల్పించినట్లు వివరించారు. ప్రస్తుతం మావోయిస్టు సాయుధ దళాలు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో అయా గ్రామాల్లో ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో కూడా మావోయిస్టు దళాలకు సహకరించకూడదని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టుల సమాచారం తెలిసినట్లైతే దగ్గరలోని పోలీస్‌స్టేషన్, జిల్లా ఉన్నతాధికారులకు కానీ తెలియచేయాలని కోరారు. సమాచారం అందించిన ప్రజల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకే ఇటీవల ములుగు జిల్లాలో 20మంది సాయుధ దళసభ్యులు అరెస్టు చేయడం జరిగిందని, 12ఆయుధాలను వారి వద్ద నుంచి రికవరీ చేయడం జరిగిందన్నారు. జనజీవన స్రవంతిలో కలిసి అజ్ఞాత సాయుధ మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం, పోలీస్‌శాఖ తగిన విధంగా రివార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. ఛత్తీస్‌గఢ్, పోలీస్‌శాఖ సహకారంతో అవసరమైన దీర్ఘకాలిక పునరావాస సౌకర్యాలను కల్పిస్తామన్నారు. లొంగిపోయిన 12మంది దళసభ్యులకు తక్షణ సహాయం కింద ప్రతి ఒక్కరికి రూ. 25వేల చొప్పున మొత్తం రూ.3లక్షల నగదును వారికి అందజేశామన్నారు. మిగతా నగదును వివిధ క్యాడర్ల వారికి ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా తీసుకున్న తర్వాత బ్యాంకు ఖాతాలో మొత్తం రూ.26లక్షల చెక్కు రూపంలో అందజేస్తామన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో జిల్లా పోలీసు అధికారులు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులు...

మడక రామ, మడకం భీమా, పూనెం కవిత, కోయం లక్మా, తాతి భీమా, పొడియం దేవి, ముచికి మసా, సోడి అంగీ, కదితి దేవా, మడకం కోస, మడవి పాండు, సోది ఉర వీరంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా, బీజాపూర్ జిల్లాలకు చెందిన వారని ఎస్పీ తెలిపారు.

డెయిరీ ఫామ్‌ను ప్రోత్సహించాలి

- జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో వెంకట ఆదిత్య



మాట్లాడుతున్న సీఈవో వెంకట ఆదిత్య

ముదిగొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): డెయిరీ ఫామ్ పాల ఉత్పత్తి కోసం రైతులను ప్రోత్సహించాలని ఆసక్తి ఉన్న ప్రతి రైతుకు రుణం మంజూరు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో వెంకట ఆదిత్య సూచించారు. గురువారం ముదిగొండలో నూతనంగా నిర్మించిన సొసైటీ కార్యాలయాన్ని చైర్మన్ తుపాకుల యలగొండస్వామితో కలిసి పరిశీలించారు. అనంతరం సీఈవో వెంకట ఆదిత్య మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతోపాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు గేదెల కోసం రుణాలను అందజేయాలన్నారు. డెయిరీ ఫామ్ పాలోత్పత్తిని ప్రోత్సహించటం ద్వారా సంస్థకు ఆదాయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, బట్టు పురుషోత్తం, బ్యాంకు డీజీఎం ఉదయశ్రీ, బ్యాంకు మేనేజర్‌లు అలేఖ్య, మధులిక, సీఈవో వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్టు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో గురువారం ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం ప్రాంతానికి చెందిన ఇరువురు గ్రానైట్ పరిశ్రమలో భాగస్వాములు. భాగస్వామి ఇంటికి తరుచూ వెళ్లే వెంకటేశ్వర్లు ఆ కుటుంబానికి చెందిన మహిళను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు నిందితుడైన వెంకటేశ్వర్లను అదుపులోకి తీసుకోని న్యాయస్థానంలో హాజరుపరిచామని పోలీసులు తెలిపారు.

యోగా దినోత్సవాన్ని నిర్వహించాలి: జీఎం

కొత్తగూడెం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జనరల్ మేనేజర్ (పర్సనల్) జీవి. కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల గనులు, డిపార్టుమెంట్లు, సింగరేణి పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం-2025 వేడుకల ఏర్పాట్లపై అన్ని ఏరియాల పర్సనల్ డిపార్టుమెంట్ అధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ చైర్మన్ డైరెక్టర్ ఎన్. బలరాం వారి ఆదేశాల మేరకు అన్ని ఏరియాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం -2025 సందర్భంగా అన్ని గనులు, డిపార్టుమెంట్లు, సింగరేణి పాఠశాలల్లో యోగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని అన్నారు. సింగరేణి సంస్థలో పని చేసే ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులు కూడా పాల్గొనేలా చూడాలని తెలిపారు. అనంతరం ఏరియాల వారీగా పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులతో కారుణ్య నియామకాలు, టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపుల ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈ సెల్ ఏజీఎం మురళీధర్‌రావు, డీజీఎం (పర్సనల్)లు కేసా నారాయణరావు, బి. శివ కేశవరావు, ముకుంద సత్యనారాయణ, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి. శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

నగరంలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్‌పై ఉన్న వస్తువులను తీయిస్తున్న పోలీసులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు కీలకమైన రహదారులలో ట్రాఫిక్‌కు అంతరాయం, పాదచారులకు అసౌకర్యం కలిగించేలా ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు గురువారం తొలిగించారని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు.కమాన్‌బజార్, కస్బాబజార్, పాత బస్టాండ్ రోడ్డులో కిలోమీటర్ల మేరా ఫుట్‌పాత్‌ల మీద చిరు వ్యాపారులు వ్యాపార సముదాయాలు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాల్స్, పండ్ల వ్యాపారాలు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో ప్రజలు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు గుర్తించి, ట్రాఫిక్ పోలీసులు ఇటీవల వ్యాపారులకు పలు సూచనలు చేశామని తెలిపారు. నగరంలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకోని ప్రతి రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫుట్ పాత్‌లపై ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సజావుగా జరిగేలా స్థానిక వ్యాపారులు పోలీసులకు సహకరించాలని సూచించారు.

119 గ్రాముల గంజాయి సీజ్

ఖమ్మం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 119 గ్రాముల గంజాయిని సీజ్ చేసిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, కోదాడ క్రాస్ రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మద్దులపల్లి గ్రామానికి చెందిన మస్తాన్, తెల్దారుపల్లికి చెందిన రఫీ, ఖమ్మం టేకులపల్లికి చెందిన చరణ్‌లు కోదాడ క్రాస్ రోడ్డులో గంజాయి తాగేందుకు వెలుతుండగా అనుమానం వచ్చిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద 119 గ్రాముల గంజాయి లబ్యమైంది. వెంటనే వారిని అరెస్టు చేసి వారి వద్ద దొరికిన గంజాయిని సీజ్ చేసి వారిపై కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.



నేడు, రేపు తెలుగు జాతీయ సదస్సు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్19(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్అండ్బీజీఎన్ఆర్డిగ్రీ కళాశాలలో నేడు, రేపు తెలుగు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి, రూసా, తెలంగాణ కళాశాల విద్య, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో శతజయంతి సాహితీమూర్తులు, దాశరధి, ఆరుద్ర జీవితం సాహిత్యం అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రెండు రాష్ట్రాలకు సంబంధించిన 72మంది డిగ్రీకళాశాల అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు.



ఖిల్లాపై యోగా శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఔత్సాహికులు

యోగాను గ్రామస్థాయిలో తీసుకెళ్లాలి

- జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి

ఖమ్మంస్పోర్ట్స్ జూన్19(ఆంధ్రజ్యోతి): యోగాను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి పేర్కొన్నారు. సర్ధార్ పటేల్ స్టేడియంలో సిద్ధార్థ యోగా విద్యాలయం ఆధ్వర్యంలో పదిరోజులుగా నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ శిబిరం గురువారం ముగింపు సందర్భంగా మాట్లాడారు. శిబిరం ఆఖరి రోజు నిర్వాహకులు వినూత్నంగా ఖమ్మం ఖిల్లాపై యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా సుమన్చక్రవర్తి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పర్యాటక ప్రాంతాల్లో యోగా శిక్షణకు ప్రాముఖ్యతను కల్పిస్తామని అన్నారు. ప్రతీఒక్కరు రోజులో కొంత సమయం కేటాయించి యోగాసనాలు సాధన చేస్తే వారిలోని మానసిక వత్తిడి దూరమవుతుందని అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి శిక్షణా శిబిరాలు గ్రామ స్థాయిలో నిర్వహించిన రోజు యోగా అనే పదానికి అసలైన రూపం వస్తుందని అన్నారు. ఆరోగ్య భారత్ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు యోగాను బలోపేతం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ కోదండరావు, శిభిరం నిర్వాహకులు క్రిష్ణమూర్తి, పతంజలి యోగా సభ్యుడు వెంకన్న ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

తిరుమలాయపాలెం, జూన్19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలందించి వారి మన్ననలు పొందాలని పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్ తెలిపారు. గురువారం రమేష్ వైద్యవిధానపరిషత్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. వైద్యాధికారితో సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలంలో వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీగ్రామంలో కూడా వైద్యశిబిరం నిర్వహించి వ్యాధులు రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది స్థానికంగా ఉండి ప్రజలకు వైద్యసేవలందించాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండ్ కృపాఉషశ్రీ పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన రమేష్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరిస్తానన్నారు.అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్లపై సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు నిజమైన పేదలకు అందేలా ప్రభుత్వాధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దయాకరరెడ్డి, ఎంపీడీవో సిలార్సాహెబ్, ఎంపీవో సూర్యనారాయణ, హౌజింగ్ ఏఈ మిథున్పాల్గొన్నారు.

ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

- భూ సమస్యల పరిష్కారానికి కృషి
- పల్లె దవాఖానా ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఏదులాపురంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మంరూరల్, జూన్19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని ఏదులాపురం గ్రామంలో కలెక్టర్ గురువారం పర్యటించారు. ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ సమయంలో ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే తెలియచేయాలన్నారు. నిర్మాణానికి ఇసుక సమస్య రాకుండా కూపన్ ద్వారా ఇసుక ఉచితంగా సరఫరా చేయాలన్నారు. భూభారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఏదులాపురంలో జరుగుతున్న భూభారతి గ్రామ సభలో పాల్గొన్నారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వకరించారు. ఏదులాపురం చెరువు కబ్జాలపై ఫిర్యాదులు వస్తున్నాయని వెంటనే సర్వే చేసి కబ్జా కాకుండా చెరువు హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెరువు పక్కన వాక్వే ఏర్పాటు చేయాలని కమీషనర్కు ఆదేశించారు. అనంతరం చెరువు, మిషన్ భగీరథ ఇన్టెక్ వెల్, పంప్హౌజ్ను పరిశీలించారు. రాబోయే 10 నుంచి 20 సంవత్సరాల కాలానికి ఉపయోగపడేలా చెరువు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పల్లెదవాఖాన ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని అన్నారు. ఏదులాపురం గ్రామంలోని పల్లె దవాఖానా, అంగన్వాడీ సెంటర్ను తనిఖీ చేశారు. బీపీ చెక్ చేయించుకున్నారు. తనిఖీ సమయంలో ఏఎన్ఎం సెలవు విషయం డీఎంహెచ్ఓకు ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ పిల్లి. రాంప్రసాద్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీటీ రవీందర్, ఆర్ఐలు ప్రసాద్, వసంత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న చావా

తిరుమలాయపాలెం,జూన్19(ఆంధ్రజ్యోతి): మండలంలో మృతిచెందిన పలువురి కుటుంబ సభ్యులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక్కొక్కరికి రూ.10 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. గురువారం వాటిని ఆత్మకమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ అందించారు. మండలంలోని 40 గ్రామపంచాయతీలో సుమారు 28 మృతుల కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు అందించారు. మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం, మేడిదపల్లి, బీరోలు, కాకరవాయి, తదితర గ్రామాల్లో ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి, మాజీజడ్పీటీసీ బెల్లం శ్రీను, ఉన్నం రాజశేఖర్, గోళ్లలింగయ్య, సిరిగద్దే ఉపేందర్,సైపుద్దీన్,యాకయ్య పాల్గొన్నారు.

నేడు కేఎంసీలో మెగా వైద్యశిబిరం

- క్యాన్సర్ నుంచి సాధారణ వ్యాధుల వరకు వైద్యపరీక్షలు
- అవసరమైన వారికి ఉన్నత వైద్యసేవలకు సిఫారసు
- ఏర్పాట్లు చేసిన కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మంకార్పొరేషన్, జూన్19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఉదయం నుంచి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్యంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వంద రోజులు కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే మెప్మా ఆధ్వర్యంలో ప్రాంతాల వారీగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో మెగా వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి పర్యవేక్షణలో కార్యచరణ చేశారు. నగరంలో 1,500 మంది కార్మికులు, ఉద్యోగులకు, మెప్మా సభ్యులు, నగర ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈవైద్యశిబిరంలో క్యాన్సర్ నుంచి సాధారణ వ్యాధుల వరకు వ్యాధి నిర్థారణ, ఇతర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. అవసరమైన వారిని గుర్తించి ఉన్నత స్థాయిలో వైద్యసేవల కోసం సిఫారసు చేస్తారు. మెగా వైద్యశిబిరం కోసం జిల్లా హాస్పటల్తో పాటుగా మంచుకొండ, మామిళ్లగూడెం, పెద్దగోపతి వైద్యాధికారులతో పాటుగా ఆర్బీఎస్కే బృందాలు, 9 మంది వైద్యాధికారులు, 8మంది ఎంఎల్హెచ్పీలతో మొత్తం 50మంది వరకు వైద్య సిబ్బంది పాల్గొననున్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేయనున్నారు.ఈమేరకు ఖమ్మంనగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

డ్రెయినేజీలను శుభ్రంగా ఉండాలి

కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మం కార్పొరేషన్, జూన్19 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం రాకముందే డ్రెయినేజీ వ్యవస్థను శుభ్రం చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. గురువారం ఖమ్మంలో పర్యటించారు. శ్రీనివాస నగర్ అయ్యప్పస్వామి దేవాలయం గ్యాంగ్ వర్క్ పనులను కమిషనర్ తనిఖీలు చేశారు. ఆప్రాంతంలో స్వచ్ఛ ఆటో డ్రైవర్లపై ఫిర్యాదులు రావటంతో మూడు రోజుల వేతనాన్ని కోత విధించాలని పారిశుధ్య పర్యవేక్షకులకు కమిషనర్ ఆదేశించారు. ఐటీహాబ్ నుంచి అల్లీపురం రోడ్డు వరకు జరుగుతున్న వాటర్ డ్రెయిన్ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని ఎక్కడైనా నీరు నిలిచే పరిస్థితి ఉండకూడదని కమిషనర్ ఆదేశించారు.

ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు

తిరుమలాయపాలెం, జూన్19(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ప్రతిపక్షనేత ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు గురువారం మండలంలోని బచ్చోడులో ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ బెల్లం శ్రీను, ఆర్.అరవిందరెడ్డి, గుర్రాల శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే కరీం, మల్లయ్య, పాల్గొన్నారు.



టీయూసీఐ సభలకు భారీగా కార్మికుల సమీకరణ

- ఖమ్మం ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర సహాయ కార్యదర్శి రామయ్య



ర్యాలీ నిర్వహిస్తున్న టీయూసీఐ నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్19(ఆంధ్రజ్యోతి): ఈనెల 21, 22 తేదిల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే టీయూసీఐ రాష్ట్ర మహాసభలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భారీగా కార్మికుల సమీకరణ చేస్తున్నట్లు టీయూసీఐ రాష్ట్రసహాయ కార్యదర్శి జీ రామయ్య పేర్కొన్నారు.రాష్ట్రమహాసభలు సందర్భంగా కార్మికులతో కలిసి గురువారం ఖమ్మంలో భారీర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా రామయ్య మాట్లాడుతూ రాష్ట్రమహాసభలకు జాతీయ అధ్యక్షుడు అమ్రీష్‌పటేల్, రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శిలు వనమాల కృష్ణ, కే సూర్యం, ఎస్ఎల్ పద్మ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. దేశంలో 35కోట్ల కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు.దశాబ్దాల పాటు కార్మికులు ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, ఆమరణ నిరాహార దీక్షలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం నాల్గు లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకొచ్చి రద్దు చేసిందని ఆరోపించారు. పరోక్షంగా కార్పొరేట్ అనుకూల నిర్ణయాలు తీసుకోవటంతో కార్మికుల హక్కులు కోల్పోతున్నారన్నారు. కార్మికుల హక్కులపై పోరాటా కార్యాచరణకు రాష్ట్ర మహాసభలు జరుపుతున్నామన్నారు. నాయకులు ఆవుల అశోక్, కెయ్యల శ్రీనివాస్, ములకలపల్లి లక్ష్మీనారాయణ, బొమ్మకంటి రమేశ్, బానోత్ రవి, బజారు, శ్రీను, తిరుపయ్య, శోభన్, జయరాజ్, రామరాజు, రమేశ్ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ ప్రవేశాలకు నేడు ఎంపికలు

ఖమ్మంసంక్షేమ విభాగం, జూన్19 (ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు శుక్రవారం లాటరీ ద్వారా ఎంపిక నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. మునిసిపల్ కార్యాలయం వెనుకభాగంలో ఉన్న డీపీఆర్సీ భవనంలో లాటరీ తీస్తామన్నారు. ఉదయం 10గంటల వరకు దరఖాస్తులు చేసిన విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

30న జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ధర్నా

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్19(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న యాదవసంఘాల ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాంయాదవ్ తెలిపారు. గురువారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో బీసీల రిజర్వేషన్లు మంత్రి పదవులు కేటాయింపు అనే అంశంపై తెలంగాణ యాదవ మహాసభ నిర్వహించారు.బీసీ కులాల్లో ఎంబీసీ కులాలకు ప్రాతినిధ్యం ఉండేలా మంత్రి పదవి కేటాయించాలన్నారు. రానున్న కేబినేట్ విస్తరణలో బీసీకులాలతో భర్తీచేయాలని డిమాండ్ చేశారు. ఈధర్నా కార్యక్రమానికి అధికసంఖ్యలో యాదవులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈసమావేశంలో వివిధ కులసంఘాల నాయకులుపాల్గొన్నారు.

వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

కొణిజర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ పరం చేస్తూ వ్యవస్థలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీపీఐ జాతీయసమితి సభ్యులు బాగం హేమంతరావు విమర్శించారు. గురువారం కొణిజర్లలోని దొండపాటి భవనంలో జరిగిన గ్రామ శాఖ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వరంగంలో పని చేస్తున్న ఎల్ఐసీ, రైల్వే విమానశాఖ ఉక్కు లాంటి లాభాలలో నడిచే దిగ్గజ సంస్థలను పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో ప్రకృతిపరంగా ఉన్న విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను చంపుతున్నారని, వారు కూడా భారతదేశ పౌరులే అని తెలిపారు. వారితో శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదులతో చర్చలు జరుపుతామన్న ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరపకుండ చంపేయడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందన్నారు. బీజేపీ దాని అనుబంధసంస్థ అయిన ఆర్ఎస్ఎస్ అవలంభిస్తున్న మతోన్మాదానికి కమ్యూనిజం మాత్రమే ప్రత్యామ్నాయం అవుతుందని తెలిపారు. స్థానిక సంస్థలలో సీపీఐ ప్రజాప్రతనిధులు బలం పెంచుకుంటేనే పేదప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు యర్రాబాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, వ్యవసాయకార్మికసంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, నాయకులు బండారు పుల్లయ్య, తోటపల్లి సీతరాములు, స్వర్ణ రమేష్, చింతల ఆదినారాయణ, వెంకన్న, బాబు, రాంబాబు, శ్రీను, ప్రసాద్, తండు సోమయ్య, నరసింహరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామకమిటిని ఎన్నుకున్నారు. గ్రామశాఖ కార్యదర్శిగా స్వర్ణ రమేష్, సహాయ కార్యదర్శులుగా తోటపల్లి సీతరాములు, చింతల ఆదినారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

కొణిజర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మలపల్లి ప్రాథమిక పాఠశాలలో రామ్‌కి, యస్‌బీఐ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యస్‌బీఐ సంజీవని ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రామంలో గత నెల రోజుల నుంచి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు చేతులు ఎలా శుభ్రపరుచుకోవాలి, వ్యాయమం ఎలా చేయాలని ఫౌండేషన్ సభ్యులు వివరించారు. అవగాహనను డాక్టర్ విజయభూషన్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజిని, రామ్‌కి ఫౌండేషన్ ప్రాజెక్ట్ కోఆర్డీనేటర్ నరేష్, నాగజ్యోతి, ప్రియాంక, అర్పిత పాల్గొన్నారు.

కల్లూరులో క్రీడా పాఠశాలల ఎంపికలు

కల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలో గురువారం మండల విద్యాశాఖ తరుఫున మండల స్థాయి క్రీడా పాఠశాలల ఎంపికలు జరిగాయి. ఈ క్రీడాలకు గాను మండల పరిధిలో గల పలు పాఠశాలల నుంచి బాల, బాలికలు తరలి వచ్చారు. ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 25 న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలో పాల్గొనేందుకు 15 మంది (బాల,బాలికల) క్రీడాకారులు అర్హత సాధించారని మండల విద్యాశాఖ అధికారిణీ నివేదిత తెలిపారు. బోడా భీమా, పసుపులేటి వీరరాఘవయ్య, అప్పారావు, సతీష్, పద్మ, త్రివేణి, కోచులు గౌతమ్‌రెడ్డి, శ్రీనివాస్, గోపాల్‌రావు పిడి నాగబాబు పాల్గొన్నారు.

రేపు వైరా మండలం ఖానాపురంలో

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న నాయకులు

వైరా, జూన్19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న మండలంలోని ఖానాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఇతర నాయకులతో కలిసి ప్రారంభిస్తారని ఆపార్టీ నియోజకవర్గ బాధ్యుడు చెరుకూరి చలపతిరావు తెలిపారు. గురువారం వైరాలో జరిగిన టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం పదిగంటలకు విగ్రహావిష్కరణ ఆ తర్వాత బహిరంగ సభ, అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశామని తెలుగుదేశం, ఎన్టీఆర్ అభిమానులు, శ్రేయోభిలాషులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు కిలారు సురేందర్, బొల్లేపల్లి శ్రీనివాసరావు, గాలి రామకృష్ణ, గుండ్ల శ్రీనివాసరావు, పమ్మి అర్జున్‌రావు, చింతల శ్రీనివాసరావు, మందడపు మధుసూదన్‌రావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

ఎనీమియా వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది

తల్లాడ, జూన్19(ఆంధ్రజ్యోతి): సికిల్ ఎనీమియా వ్యాధి వంశపారంపర్యంగా సంక్రమిస్తుందని మండల వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్ అన్నారు. గురువారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో తల్లాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రక్తసంబంధీకుల మధ్య వివాహాలను కూడా ప్రోత్సహించవద్దన్నారు. సికిల్ ఎనీమియా వ్యాధీ ఉన్నవారిలో 20నుంచి30రోజుల వరకు మాత్రమే ఎర్రరక్తకణాలు జీవించి ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ, హెల్త్ సూపర్‌వైజర్లు కె.పెద్దపుల్లయ్య, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికే కీలకం

చింతకాని, జూన్19(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసారి పుల్లయ్య అన్నారు.గురువారం మండల పరిధిలోని జగన్నాధపురం, పందిళ్లపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో ఆయన పంట పొలాలను పరిశీలించారు. జూన్ చివరి వారం నుంచి జులై మధ్య వరకు పత్తి విత్తేందుకు అనువైన సమయం అన్నారు. విత్తన శుద్ధి అనంతరం విత్తు నాటాలన్నారు.వర్షాలు కురిసిన తరువాత భూమిలో తేమను చూసి విత్తనం నాటాలన్నారు.

తెలంగాణ పబ్లిక్ స్కూల్

తల్లిదండ్రుల కమిటీల ఏర్పాటు

మధిరరూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణపబ్లిక్ స్కూల్ కమిటీల ఏర్పాటు కోసం తల్లిదండ్రులు సమావేశం హెచ్ఎం సీహెచ్. మురళీమోహన్‌రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ చుంచు రామకృష్ణ, మధిర మండల ఎంఈవో వై.ప్రభాకర్‌లు అతిథులుగా హాజరై మాట్లాడారు. స్కూల్ ఏర్పాటు, విధి విధానాలను వివరించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా సిరిపురంలో ఈ పాఠశాల ఏర్పాటు చేస్తున్నందున గ్రామస్థులు సహకరించాలని కోరారు. ఈ సమావేశానికి గ్రామస్థులు, రాజకీయ నాయకులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. కమిటీ ఎంపిక కోసం గ్రామస్థుల నుంచి సలహాలు తీసుకున్నారు. అడ్వయిజరీ కమిటీ 30మందితో, తల్లుల కమిటీ పదిమందితో ఏర్పాటు చేశారు. కమిటీసభ్యులను అధికారులు అభినందించారు. ఏకగ్రీవంగా కమిటీ ఎంపిక కావడానికి సహకరించేందుకు గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

వైరా, జూన్19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అనుబంధ నాయీబ్రాహ్మణ సమాఖ్య సంక్షేమ సేవసంఘం ఆధ్వర్యంలో ద్వారకానగర్‌కు చెందిన శ్రీకాకుళం శ్రీనివాస్‌కు రూ.ఐదువేల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. కార్యదర్శి దేవరకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయమందించారు.



ఆంధ్రజ్యోతి
శుక్రవారం 20 జూన్ 2025
ZONE
వైరా-మధిర
సత్తుపల్లి
8
WYRA, MADHIRA, SATHUPALLY
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

విత్తనాల ఎంపికే కీలకం

చింతకాని, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసారి పుల్లయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని జగన్నాధపురం, పందిళ్లపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో ఆయన పంట పొలాలను పరిశీలించారు. జూన్ చివరి వారం నుంచి జులై మధ్య వరకు పత్తి విత్తేందుకు అనువైన సమయం అన్నారు. విత్తన శుద్ధి అనంతరం విత్తు నాటాలన్నారు. వర్షాలు కురిసిన తరువాత భూమిలో తేమను చూసి విత్తనం నాటాలన్నారు. సందర్భంగా విత్తనం నాటే విధానం, తెగుళ్ల నియంత్రణ, ఎరువుల నిర్వహణ నీటి నిర్వహణపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో సోములపల్లి మానస, ఏఈవోలు రాము, కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

కల్లూరులో క్రీడా పాఠశాలల ఎంపికలు



కల్లూరు మినీ స్టేడియంలో ప్రతిభ కనబరుస్తున్న ఓ క్రీడాకారిణి

కల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలో గురువారం మండల విద్యాశాఖ తరుపున మండల స్థాయి క్రీడాపాఠశాలల ఎంపికలు జరిగాయి. ఈ క్రీడాలకు గాను మండల పరిధిలో గల పలు పాఠశాలల నుంచి బాల, బాలికలు తరలి వచ్చారు. ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 25 న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలో పాల్గొనేందుకు 15 మంది (బాల,బాలికల) క్రీడాకారులు అర్హత సాధించారని మండల విద్యాశాఖ అధికారిణీ నివేదిత తెలిపారు. బోడా భీమా, పసుపులేటి వీరరాఘవయ్య, అప్పారావు, సతీష్, పద్మ, త్రివేణి, కోచులు గౌతమ్‌రెడ్డి, శ్రీనివాస్, గోపాల్‌రావు పిడి నాగబాబు పాల్గొన్నారు.

ఐదువేల ఆర్థికసాయం

వైరా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అనుబంధ నాయీబ్రాహ్మణ సమాఖ్య సంక్షేమ సేవసంఘం ఆధ్వర్యంలో ద్వారకానగర్‌కు చెందిన శ్రీకాకుళం శ్రీనివాస్‌కు రూ.ఐదువేల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. కార్యదర్శి దేవరకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సాయమందించారు. వెంకటేష్, నారాయణరావు, నాయకులు అప్పారావు, మురళీకృష్ణ, శ్రీకాకుళం సుశీల, నాగమణి, సావిత్రి, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

సబ్ డివిజన్ కార్యాలయంలో కానరాని అధికారులు

» సమీక్షల పేరుతో జిల్లా కార్యాలయాలకే పరిమితం » క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ కరువు » తలుపులు కూడా తెరుచుకోని వైనం

కల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఉన్న పలు ప్రభుత్వ సబ్ డివిజన్ కార్యాలయాలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు అస్సలు ఉండకుండ తమ ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతూ ఉండడంతో ఆయా కార్యాలయాలు తలుపులు తెరుచుకోక మూతపడ్డాయి. మరో వైపున ప్రభుత్వం తరుపున ఆయా శాఖల తరుపున చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కరువైంది. అలాగే కింది స్థాయిలో అధికారుల, సిబ్బంది పనీతీరుపై మానిటరింగ్ ఉండని పరిస్థితి. ఇలా కల్లూరు సబ్‌డివిజన్‌లో సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయం ఇక్కడ పేరుకు మాత్రమే ఉంది. కీలక అధికారి ఏనాడు ఈ కార్యాలయానికి అందుబాటులో ఉండని పరిస్థితి. ఈ సబ్‌డివిజన్ కార్యాలయం పరిధిలో ఐదు మండలాల బీసీ సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణ ఉంటుంది. కీలక అధికారి సరిగ్గా అందుబాటులో ఉండనందున వసతి గృహాల పర్యవేక్షణతోపాటు విద్యార్థుల ప్రవేశాల పురోగతి కుంటుంపడుతోంది. ఇక ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం కూడా ఉండగా ఇక్కడ ఏనాడు కీలక అధికారి విధులకు రాకపోవడంతో గతంలో కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో అనుబంధంగా సాగిన కార్యాలయం తలుపులు మూతపడ్డాయి. ఈ కార్యాలయం పరిధిలో ఏన్కూరు, కారేపల్లి, కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాలు విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో జరిగే పలు ఉపాధి హామీ పనుల తీరుపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ కరువైంది. ఇంకాను డివిజనల్ పంచాయితీ అభివృద్ధి అధికారి కార్యాయలం కొత్తగా హనుమాతండ పంచాయితీలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇంత వరకు కీలక అధికారి, సిబ్బంది పనిచేయని పరిస్థితి. ఇలా కల్లూరు సబ్‌డివిజన్ పేరుతో ఆయా కార్యాలయాలు మొక్కుబడిగా ఉన్నాయి కాని పరిపాలన పరంగా కార్యాకలాపాలు కొనసాగని పరిస్థితి. ఆయా అధికారులు తమ శాఖల సమీక్షల పేరుతో జిల్లా కేంద్రం కార్యాలయాలకు మాత్రమే పరిమితమవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సబ్ డివిజనల్ అధికారులు తమ కార్యాలయాల విధులకు వస్తున్నారా లేదా అన్న విషయమై జిల్లా స్థాయిలో గల కీలక అధికారులు కూడ చూసి చూడనట్లుగా ఉంటున్నట్లు తెలసింది. ఇప్పటికైనా జిల్లా స్థాయిలో ఆయా శాఖల అధికారులు స్పందించి కల్లూరులో ఉన్న సబ్ డివిజన్ కార్యాలయాలకు కీలక అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేనిచో పర్యవేక్షణ కరువై ఆయా శాఖల తరుపున చేపట్టే సేవలు పలు వర్గాల ప్రజలకు, పేద విద్యార్థులకు సక్రమంగా అందక నష్టాపోవాల్సి వస్తుంది స్థానిక ప్రజలు భావిస్తున్నారు.



అధికారులు రాకపోవడంతో మూసి ఉన్న విభాగాలు

రేపు ఖానాపురంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుదేశం నాయకులు

వైరా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న మండలంలోని ఖానాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఇతర నాయకులతో కలిసి ప్రారంభిస్తారని ఆపార్టీ నియోజకవర్గ బాధ్యుడు చెరుకూరి చలపతిరావు తెలిపారు. గురువారం వైరాలో జరిగిన టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం పదిగంటలకు విగ్రహావిష్కరణ ఆ తర్వాత బహిరంగ సభ, అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశామని తెలుగుదేశం, ఎన్టీఆర్ అభిమానులు, శ్రేయోభిలాషులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు కిలారు సురేందర్, బొల్లేపల్లి శ్రీనివాసరావు, నాయకులు గాలి రామకృష్ణ, గుండ్ల శ్రీనివాసరావు, పమ్మి అర్జున్‌రావు, చింతల శ్రీనివాసరావు, మందడపు మధుసూదన్‌రావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, మద్దిని రామారావు పాల్గొన్నారు.

రాయనపేటలోనూ రేపు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

బోనకల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయనపేట గ్రామంలో ఈ నెల 21న సాయంత్రం నాలుగు గంటలకు టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ కోరారు. బోనకల్‌లో గురువారం మండల పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నరసింహులు, టీటీడీ సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డిలు పాల్గొనున్నారని, కార్యకర్తలు, నాయకులు అదిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొంగర జగన్, సాదినేని హన్మంతరావు, నందమూడి సత్యానారాయణ, గంగుల శ్రీను, షేక్ ఖాసీం, కన్నెపోగు రవీందర్‌బాబు పాల్గొన్నారు.

వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న బాగం హేమంతరావు

కొణిజర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ పరం చేస్తూ వ్యవస్థలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీపీఐ జాతీయసమితి సభ్యులు బాగం హేమంతరావు విమర్శించారు. గురువారం కొణిజర్లలోని దొండపాటి భవనంలో జరిగిన గ్రామశాఖ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వరంగంలో పని చేస్తున్న ఎల్ఐసీ, రైల్వే విమానశాఖ ఉక్కు లాంటి లాభాలలో నడిచే దిగ్గజ సంస్థలను పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో ప్రకృతిపరంగా ఉన్న విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను చంపుతున్నారని, వారు కూడా భారతదేశ పౌరులే అని తెలిపారు. వారితో శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదులతో చర్చలు జరుపుతామన్న ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరపకుండ చంపేయడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందన్నారు. బీజేపీ దాని అనుబంధసంస్థ అయిన ఆర్ఎస్ఎస్ అవలంబిస్తున్న మతోన్మాదానికి కమ్యూనిజం మాత్రమే ప్రత్యామ్నాయం అవుతుందని తెలిపారు. స్థానిక సంస్థలలో సీపీఐ ప్రజాప్రతనిధులు బలం పెంచుకుంటేనే పేదప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు యర్రాబాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, వ్యవసాయకార్మికసంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, నాయకులు బండారు పుల్లయ్య, తోటపల్లి సీతరాములు, స్వర్ణ రమేష్, చింతల ఆదినారాయణ, వెంకన్న, బాబు, రాంబాబు, శ్రీను, ప్రసాద్, తండు సోమయ్య, నరసింహరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామకమిటిని ఎన్నుకున్నారు. గ్రామశాఖ కార్యదర్శిగా స్వర్ణ రమేష్, సహాయ కార్యదర్శులుగా తోటపల్లి సీతరాములు, చింతల ఆదినారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించిన అధికారులు

ముదిగొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం ఎడవల్లి లక్ష్మీపురంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎంపికైన లబ్ధిదారుల ఇళ్లను గురువారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో భాస్కర్‌రావు పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్ల, ఆర్థిక పరిస్థితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



ఆశ్రమంలో ఉన్న వృద్ధురాలికి పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వైరా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపూడిలో ఉన్న వృద్ధాశ్రమంలో నీతోడు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సోమవరం గ్రామానికి చెందిన కాంపల్లి బోసుబాబు, కవిత దంపతుల పెళ్లి రోజును పురస్కరించుకొని ఆ వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. నందిగామ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వినూత్న ప్రదర్శన



నోట్ పుస్తకాలతో యోగాడే తెలుపుతూ వినూత్న ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

కొణిజర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కొణిజర్ల మండలం తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం వినూత్నంగ యోగా ప్రదర్శన చేశారు. యోగా ఆకారంలో నోట్‌పుస్తకాలను పెట్టి యోగా చేసుకుంటూ యోగా శుభాకాంక్షలు తెలిపారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు ఆగస్టు 13 గడువు

సత్తుపల్లి, జూన్19 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ స్టడీ సెంటర్‌లో ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు ఆగస్టు 13వరకు గడువు అని కో-ఆర్డినేటర్ డాక్టర్ చీపు పూర్ణచంద్రరావు గురువారం తెలిపారు. డిగ్రీలో అడ్మిషన్ పొందేందుకు ఇంటర్మీడియేట్, డిప్లొమా, ఐటీఐ పాసైన విద్యార్థులు అర్హులని, మరిన్ని వివరాలకు 9491881910, 8187837058 సంప్రదించాలన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కొణిజర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మలపల్లి ప్రాథమిక పాఠశాలలో రామ్‌కి, యస్‌బీఐ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యస్‌బీఐ సంజీవని ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రామంలో గత నెల రోజుల నుంచి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు చేతులు ఎలా శుభ్రపరుచుకోవాలి, వ్యాయమం ఎలా చేయాలని ఫౌండేషన్ సభ్యులు వివరించారు. అవగాహనను డాక్టర్ విజయభూషన్ డెమో రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజిని, రామ్ కి ఫౌండేషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నరేష్, నాగజ్యోతి, ప్రియాంక, అర్పిత, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న డీఈవో సత్యనారాయణ

పెనుబల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యార్థులను చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ ఉపాధ్యాయులను కోరారు. గురువారం బడిబాటలో స్పోర్ట్స్‌డే సందర్భంగా వీఎంబంజర్, కుప్పెనకుంట్ల పాఠశాలలను డీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రణాళికను తయారుచేసుకోవాలని, ఉపాధ్యాయులు పాఠశాల ప్రారంభంలోనే వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సామర్థ్యాలను పెంచటానికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి పాఠశాలలకు సమాజంలో మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోనకల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాలల్లో విద్యార్థులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని, వారికి నాణ్యమైన విద్యను అందించే బాధ్యత తమదని ఎంఈవో దామాల పుల్లయ్య తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల సారధి చాపలమడుగు కోటి కళాబృందంతో గురువారం బోనకల్ ఉన్నత పాఠశాలలో బడిబాట కళాజాతను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ప్రైవేటు వద్దు- ప్రభుత్వ బడులే ముద్దు అన్న నినాదంతో కళాజాత ప్రదర్శన అందరిని ఆలోజింప చేస్తుందన్నారు. ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని, బడుల్లో అమలవుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంప్లెక్స్ హెచ్ఎం గోపిచంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కళాజాతా ప్రదర్శనలో మాట్లాడుతున్న ఎంఈవో దామాల పుల్లయ్య

అక్రమ రవాణాను నియంత్రించాలి

» అదనపు డీసీపీ ప్రసాదరావు

బోనకల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమ రవాణాను నియంత్రించేందుకు గానూ ప్రత్యేక వాహనాల తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలని లా అండ్ అర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాదరావు ఆదేశించారు. బోనకల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలతో పాటు చార్జిషీట్, పంక్షనల్ వర్టికల్స్, 5ఎస్ అమలు, హెచ్ఆర్ఎంఎస్, కేసుల్లో ఉన్న వాహనాలను పరిశీలించారు. బీట్ డ్యూటీ సిబ్బంది చేస్తున్న విధులు, పాత నేరస్తుల నివాసాల కదలికలను ఏవిదంగా గుర్తిస్తున్నారో? అడిగి తెలుసుకున్నారు.

నూతి సత్యనారాయణకు ఘన సన్మానం



వైరా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన నూతి సత్యనారాయణను వైరా మండలంలోని ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో బుధవారం రాత్రి కాంగ్రెస్ గ్రామకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు నూతి వెంకటేశ్వరరావు, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్ దొడ్డా ఉషారాణి, మల్లు రామకృష్ణ, నాయకులు పొట్లపల్లి నాగేశ్వరరావు, చిట్టిమోతు వెంకటచారి, ఉప్పలయ్య, అడుసుమల్లి గణేష్, సూరపనేని నాగేశ్వరరావు, రంగా జనార్థన్, పట్టయ్య, నర్వనేని గోపాలరావు, పెద్దప్రోలు లక్ష్మయ్య, జెన్ను పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శ



చంద్రుపట్లలో నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో గురువారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన శుభ, అశుభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా చంద్రుపట్లలో బీఆర్ఎస్ నాయకుడు నెల్లూరి రామభద్రయ్య నివాసంలో నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆ తరువాత బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు కంటికి శస్త్ర చికిత్స చేయించుకోగా ఆయనను పరామర్శించారు. ఇటీవల తల్లాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కోడుకులు కొత్తపల్లి రాంబాబు, క్రిశాంత్‌లు ఇద్దరు మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి చిత్రపటాలకు నివాళులర్పించి సానుభూతి సంతాపం తెలిపారు. ఇటీవల ప్రమాదంకు గురియైన పైళ్ల మోహన్‌రావు నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య క్షేమాలను సండ్ర అడిగి తెలుసుకున్నారు. ఇంకాను అనారోగ్యంతో మృతి చెందిన పోనుగూమాటి నరసమ్మ, పోట్రూ పుల్లయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సండ్రతో పాటుగా కల్లూరు మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బిఆర్ఎస్ నాయకులు కాటంనేని వెంకటేశ్వరరావు, గొల్లమందల ప్రసాద్, సిహెచ్ కిరణ్‌కుమార్, వల్లభనేని శ్రీను, దొడ్డపునేని రవి, గోసు రమణయ్య, నెల్లూరి పుల్లయ్య, తన్నీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనీమియా వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది

తల్లాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి వంశపారంపర్యంగా సంక్రమిస్తుందని మండల వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్ అన్నారు. గురువారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో తల్లాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తసంబంధీకుల మధ్య వివాహాలను కూడా ప్రోత్సహించవద్దన్నారు. సికిల్ ఎనీమియా వ్యాధీ ఉన్నవారిలో 20నుంచి30రోజుల వరకు మాత్రమే ఎర్రరక్తకణాలు జీవించి ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ, హెల్త్ సూపర్‌వైజర్లు కె.పెద్దపుల్లయ్య, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలో ప్రభుత్వం విఫలం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కమల్‌రాజ్

మధిరరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మాజీ జడ్పీచైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజ్ విమర్శించారు. గురువారం మధిర బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ, రైతుభరోసా అసంపూర్తిగా అమలు చేశారని ఆరోపించారు. మండలంలో ఒక్క గ్రామానికి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి మిగతా గ్రామాలను వదిలేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశంలో తప్పుడు ప్రకటనలు చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. మధిరలోనిర్మించే నూతన బస్‌స్టేషన్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయుకలు చిత్తారు నాగేశ్వరరావు, చావా వేణు, అరిగే శ్రీను, వైవీ అప్పారావు, బొగ్గుల భాస్కరరెడ్డి, కటికల సత్యనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

తెలంగాణ పబ్లిక్ స్కూల్
తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ

మధిరరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణపబ్లిక్ స్కూల్ కమిటీల ఏర్పాటు కోసం తల్లిదండ్రులు సమావేశం హెచ్ఎం సీహెచ్.మురళీమోహన్‌రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ చుంచు రామకృష్ణ, మధిర మండల ఎంఈవో వై.ప్రభాకర్‌లు అతిథులుగా హాజరై మాట్లాడారు. స్కూల్ ఏర్పాటు, విధి విధానాలను వివరించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా సిరిపురంలో ఈ పాఠశాల ఏర్పాటు చేస్తున్నందున గ్రామస్థులు సహకరించాలని కోరారు. ఈ సమావేశానికి గ్రామస్థులు, రాజకీయ నాయకులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. కమిటీ ఎంపిక కోసం గ్రామస్థుల నుంచి సలహాలు తీసుకున్నారు. అడ్వయిజరీ కమిటీ 30మందితో, తల్లుల కమిటీ పదిమందితో ఏర్పాటు చేశారు. కమిటీసభ్యులను అధికారులు అభినందించారు. ఏకగ్రీవంగా కమిటీ ఎంపికకావడానికి సహకరించేందుకు గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న నాయకులు

తల్లాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం తల్లాడలో ఘనంగా నిర్వహించారు. బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, మండల కాంగ్రెస్ నాయకులు జక్కంపుడి కిషోర్, గోవిందు శ్రీనివాసరావు, కటికి కిరణ్ పాల్గొన్నారు.

మధిరరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం మధిర కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు సూరంశెట్టి కిషోర్, తేమటి నవీన్‌రెడ్డి, కర్నాటి రామారావు, అద్దంకి రవికుమార్, చావా వేణు పాల్గొన్నారు.

వైరా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను గురువారం మండల కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మండల అధ్యక్షులు కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు బోళ్ల గంగారావు, మచ్చా బుజ్జీ, పమ్మి అశోక్, పాలేటి నర్సింహారావు, దార్న రాజశేఖర్, చప్పిడి వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, గోపి, వీరయ్య, శ్రీధర్, కొల్లి రమేష్, హన్మంతరావు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రతనేత లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరసింహారావు, మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెనుబల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన పెనుబల్లి మండలం టేకులపల్లి జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన గుడికందుల కోటేశ్వరరావు తల్లి సావిత్రితో కలిసి ద్విచక్రవాహనంపై సత్తుపల్లి వెళ్తుండగా ఓలారీ వెనుకనుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుడికందుల సావిత్రి(55)తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. కుమారుడు కోటేశ్వరరావుకు స్వల్పగాయాలు కావడంతో అతడిని పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. వీఎంబంజర్ ఎస్ఐ కె.వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.